సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
సోమవారం, 13.04.2026

www.mudranews.in | @mudranews


సంపుటి:13 సంచిక: 171
పేజీలు: 12 వెల: రూ. 5


## రాజకీయ యుద్ధం

**జీవన్ రెడ్డి – మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మధ్య పెరుగుతున్న వేడి**

- నాలుగు దశాబ్దాల బంధం కట్
- పార్టీ విధేయతా? సీనియర్ తో ఫైటా? అడ్లూరి ముందుకే..
- పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించాల్సిన బాధ్యత
- జీవన్ రెడ్డి విమర్శలకు చెక్ చెప్పాల్సిందే..
- జీవన్ పార్టీ మార్పుతో జగిత్యాల జిల్లాలో మారిన సమీకరణాలు
- జిల్లాపై ఇప్పుడు అడ్లూరికి గురుతర బాధ్యత

**ముద్ర , కరీంనగర్ :** కాంగ్రెస్ సీనియర్ నేత.. నాలుగు దశాబ్దాలుగా ఆ పార్టీలో కొనసాగిన కురవృద్ధుడు.. శేష జీవితం ప్రశావంతంగా గడుపుతానని ప్రతీ ఎన్నికల్లో ఇవే నాకు చివరి ఎన్నికలు అంటూ ప్రకటిస్తూ.. ఓటమి చవి చూస్తున్న జీవన్‌రెడ్డి.. ఇటీవలే హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. బీఆర్ఎస్ నుంచి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేదు. పార్టీ మార్పిడి నిర్ణయం జగిత్యాల జిల్లా రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టించింది. 1990 నుంచి జిల్లాలో జీవన్ రెడ్డి ప్రభావం ఎమ్మెల్యే టికెట్ల నుంచి మంత్రి పదవుల వరకు మిగతా 02లో



## మూగబోయిన కోకిల స్వరం

**ప్రముఖ గాయని ఆశాభోంస్లే కన్నుమూత**




- ముంబయిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ఛాతి ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రిలో చేరి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్
- సోమవారం శివాజీ పార్క్‌లో అంత్యక్రియలు
- సినీ లోకంలో విషాదం.. ప్రముఖుల సంతాపం
- సంగీత ప్రపంచంలో ముగిసిన స్వరశకం

12

## చిత్తశుద్ధి నిరూపించుకోండి

**బిల్లును వ్యతిరేకిస్తే మహిళలే బుద్ధి చెప్తారు**




- మహిళల ఆశలు నెరవేర్చే చారిత్రాత్మక బిల్లు
- 2029 ఎన్నికల్లో 33% రిజర్వేషన్ లక్ష్యం.. కేంద్రం సంకల్పం
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్టీలకు కేంద్రమంత్రి బండి సంజయ్ సవాల్
- అన్ని పార్టీలకు నరేంద్ర మోడీ లేఖ.. మద్దతు కోరిన ప్రధాని

03

## కాళేశ్వర రాజకీయం

**మొన్నటిదాకా అక్కరకు రాని ప్రాజెక్టుగా కాళేశ్వరంపై విమర్శలు**




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఊహించని విధంగా యూటర్న్ తీసుకుంది. ఢిల్లీ వెళ్లి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి అత్యవసరంగా ఈ ప్రాజెక్టు మీద సమీక్ష చేసి.. మరమ్మత్తులకు ఆదేశించారు. అంతకు ముందు వారం కిందటే కేంద్రం కూడా ఇదే పాట పాడింది. కాళేశ్వరం పనికిరాని ప్రాజెక్టు అంటూ పార్లమెంట్ వేదికగా విరుచుకుపడింది. ఇక్కడ రాష్ట్రం.. అక్కడ కేంద్రం ఒకే అంశంలో దూకుడు చూపించినట్టే చూపించి.. మళ్లీ టర్న్ తీసుకున్నాయి. అటు కాళేశ్వరం జలాలు మల్లన్నసాగర్ కు రావడంతో ఇది అవకాశంగా మల్చుకునేందుకు బీఆర్ఎస్ ఓ ప్రయత్నం మొదలుపెట్టినా.. దాన్ని జనాల్లోకి తీసుకెళ్లకముందే ప్రభుత్వం మరమ్మతు చేస్తామంటూ కొత్తగా ప్రకటించింది. నిజానికి, ఈ కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కాంగ్రెస్ – బీఆర్ఎస్ మధ్య వ్యూహా లకు పదును పెట్టింది. ఘోష్ కమిషన్, లీగల్ నోటీసులు, విచారణలు, కోర్టుకెక్కడం వంటి అంశాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి పైన రేవంత్ తొలి నుంచి గులాబీ పార్టీ నేతలను టార్గెట్ చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత విచారణకు కమిషన్ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరయ్యారు. కమిషన్ సంధించిన మిగతా 02లో

**కాళేశ్వరం పునరుద్ధరణ**

### పనులు వేగవంతం చేయాలి



- పనుల వేగవంతానికి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## తెలంగాణలో బేషాజాలు లేని సర్కార్

**మంత్రి శ్రీధర్ బాబు**

- ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి
- రూ.210 కోట్ల బయో గ్యాస్ ఫ్యాక్టరీతో సిద్ధిపేటలో పారిశ్రామిక వృద్ధి
- రాజకీయాలకు అతీతంగా పరిశ్రమల ఏర్పాటుకు అందరూ సహకరించాలి: తన్నీరు హరీష్ రావు

03



## పంతాల మధ్య నలిగిన శాంతి

**ఇరాన్ – అమెరికా చర్చలు విఫలం**

- ఇజ్రాయిల్ దూకుడు.. అమెరికా పంతం
- వెనక్కి తగ్గని ఇరాన్ మొండి పట్టుదల
- గల్ఫ్‌లో మళ్లీ యుద్ధ మేఘాలు!
- అణు కార్యక్రమాలపై విభేదాలు
- హర్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత?
- ప్రపంచాన్ని కుదిపేస్తున్న చమురు సంక్షోభం
- పెరుగుతున్న ఇంధన ధరలు
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం
- ఇరు దేశాలు వెనక్కి తగ్గకపోతే గ్లోబల్ స్థాయిలో సంక్షోభం

**ముద్ర డెస్క్ :** అమెరికా , ఇరాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వైరం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా జరిగిన శాంతి చర్చలు ఎటువంటి ఫలితం లేకుండానే ముగియడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. అహంకారపూరితమైన వ్యక్తిత్వం, పట్టువిడవని నైజం ఉన్న ఇద్దరు వ్యక్తులు ఏ కోశాన కూడా కలవలేరన్నట్లుగా.. అమెరికా, ఇరాన్ దేశాల అధినేతల వైఖరి తయారైంది. ఈ చర్చల వైఫల్యం కేవలం ఆ రెండు దేశాలకే కాదు.. మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు.. శాంతి భద్రతలకు సవాలుగా మారింది.

**చర్చలు ఎందుకు విఫలమయ్యాయి?**

అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం.. ఇరాన్ ప్రతినిధులతో ముఖాముఖి భేటీ అయ్యారు. అయితే చర్చల ప్రారంభం నుంచే ఇరు వర్గాల మధ్య తీవ్ర విభేదాలు పొడసూపాయి. అమెరికా విధించిన కఠిన నిబంధనలను, ముఖ్యంగా అణు కార్యక్రమాలపై మిగతా 02లో



## బాబు డైరెక్షన్ లో రేవంత్ పాలన

**జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

- కేసీఆర్ తో భేటీ ఎఫెక్ట్.. కాంగ్రెస్‌పై దాడి
- రేవంత్ రెడ్డి పై ఘాటు విమర్శలు
- రాహుల్ గాంధీ సిద్ధాంతాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం?

03



## కన్నవారితో కన్నీళ్లు పెట్టించకు

**కుటుంబ భావోద్వేగాలపై కేటీఆర్ స్పందన**

03

- కవిత వైఖరిపై ఆందోళన
- ప్రవర్తన మార్చుకోవాలంటూ కవితకు సూచన
- కవిత కొత్త పార్టీ చర్చల మధ్య సోదరుడి సున్నిత హెచ్చరిక
- రాజకీయాల కంటే కుటుంబం ముఖ్యమన్న కేటీఆర్ సందేశం



## పార్టీ పేరు మార్చి నష్టపోయాం

**భవిష్యత్తులో టీఆర్ఎస్ గానే కొనసాగుతాం**

03

- రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలోనే ఉంటా
- త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## మహిళలకు మంచి రోజులు

**16న మహిళా రిజర్వేషన్ బిల్లు**

02

- ఏకగ్రీవంగా ఆమోదించాలని ప్రధాని పిలుపు
- బీజేపీ సభ్యులకు విప్ జారీ
- సభ్యులంతా హాజరుకావాలని ఆదేశం



*భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది మహిళలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు (నారీ శక్తి వందన్ అధినియమ్) ఈ నెల 16న పార్లమెంటు ముందుకు రానుంది. ఈ చారిత్రక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు లేఖ రాశారు. 2029 లోక్‌సభ , అసెంబ్లీ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ఈ కీలక ఘట్టానికి హాజరు కావాలంటూ బీజేపీ ఇప్పటికే తమ సభ్యులకు విప్ జారీ చేసింది. మహిళలు నిర్ణయాత్మక శక్తులుగా ఎదిగినప్పుడే 'వికసిత భారత్' కల సాకారమవుతుందని పేర్కొన్న ప్రధాని, పార్టీలన్నీ రాజకీయాలకు అతీతంగా ఈ బిల్లుకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.* **-ముద్ర, డెస్క్**

## బాలికలదే పైచేయి

- ఫస్టియర్ లో 66.2, సెకండియర్ లో 70.58 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన పాస్ పర్సంటేజ్
- మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కేకే, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

09




ట్రంప్ మాటలకే పరిమితమైన శాంతి రాజకీయాలు.. పాకిస్తాన్ శాంతి ప్రచారం ప్రపంచానికి జోక్‌గా మారిపోయింది.. అటు ట్రంప్, ఇటు పాకిస్తాన్ పరువుపోగొట్టుకున్నాయి..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 13.04.2026
www.mudranews.in | @mudranews



## మాంసంతో లాభాలు



మాంసంలో అధిక ప్రోటీన్ ఉండటం వల్ల కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. శరీర శక్తి, రిపేర్ ప్రక్రియలకు ఇది అవసరం.

# రాజకీయ యుద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించింది. కాంగ్రెస్ లో ఎంతో సీనియర్ అయిన జీవన్ రెడ్డి ఇప్పుడు తను ఎంతగానో వ్యతిరేకించిన బీఆర్ఎస్‌లో చేరడంతో పరిస్థితి పూర్తిగా మారింది. జీవన్ రెడ్డి తన భవిష్యత్ కోసం మారిన ఈ మార్పు వల్ల ఆయన స్నేహితులు విడిపోతూ, ప్రత్యర్థులు బలపడుతున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ఎన్నికల్లో విజయవంతమైన అనేక మంది ఇప్పుడు కొత్త మార్గాలు వెతుకుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో జీవన్ రెడ్డి పార్టీ మార్పులు పలు కొత్త తలనొప్పులకు దారితీసింది. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధం, గురు–శిష్యుల బంధం ఇప్పుడు రాజకీయ చదరంగంలో ప్రత్యర్థులుగా మారే పరిస్థితిని తెచ్చిపెట్టింది. సీనియర్ నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో, అటు ఆయన శిష్యుడు, ప్రస్తుత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అగ్నిపరీక్ష ఎదురవుతోంది.

**నాలుగు దశాబ్దాల బంధానికి బీటలు..**

1980వ దశకం నుండి కాంగ్రెస్‌లో కీలక నేతగా, జిల్లా రాజకీయాల్లో ధ్రువతారగా వెలిగిన జీవన్ రెడ్డి నిర్ణయం అందరినీ విస్మయానికి గురిచేసింది. తన బద్ధశత్రువు, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడాన్ని జీర్ణించుకోలేకపోయిన జీవన్ రెడ్డి, చివరకు గులాబీ గూటికి చేరారు. ఈ పరిణామంతో జగిత్యాల కోటలో కాంగ్రెస్ బలహీనపడగా, విపక్షాలకు కొత్త ఊపిరి వచ్చినట్లయింది.

**జీవన్ పై అడ్లూరి లక్ష్మణ్ యుద్ధం చేయాల్సిన పరిస్థితి..**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఆది నుంచి శ్రీపాదరావును గురువుగా భావించి రాజకీయాల్లో ఎదిగారు. ఆ తర్వాత శ్రీధర్ బాబుతో సన్నిహిత్యం పెంచుకున్నారు. కానీ ధర్మపురిలో గెలిచాక తప్పనిసరి పరిస్థితుల్లోనే జీవన్ రెడ్డి లాంటి సీనియర్ ను గౌరవిస్తూ ముందుకు సాగారు. ఇప్పటికే జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ దాదాపు 16 సార్లకు పైగా టికెట్ ఇచ్చి గౌరవించింది.. గెలిపించింది. ఇప్పటికే ఎన్నో పదవులు అనుభవించినా తన వారికి జీవన్ రెడ్డి పెద్దగా చేసింది ఏమీ లేదని విమర్శలున్నాయి.

అందుకే జీవన్ రెడ్డి ఎప్పుడూ తన కోసం తప్పితే పార్టీ కోసం పాటు పడలేదన్న ఆరోపణలు క్షేత్ర స్థాయి నుంచి వినిపిస్తాయి. ఇన్నాళ్లు సీనియర్ గా గౌరవించిన జీవన్ రెడ్డితోనే ఇప్పుడు జగిత్యాల జిల్లా మంత్రిగా అడ్లూరి లక్ష్మన్ కుమార్ యుద్ధం చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు పార్టీ హైకమాండ్ ఆదేశాలతో జీవన్ రెడ్డిని ఎదుర్కోవాలి.. విమర్శలు చేయాల్సిందే. కాంగ్రెస్ ను వీడిన జీవన్ రెడ్డి విమర్శలను తిప్పికొడుతూ జగిత్యాల జిల్లాకు పెద్ద దిక్కుగా అడ్లూరి పార్టీని బలోపేతం చేయాలి. జగిత్యాలలో జీవన్ రెడ్డికి ప్రత్యామ్నాయంగా పార్టీని నిలబెట్టి ఈ సీనియర్ కు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

కాంగ్రెస్ లో మంత్రిగా.. కీలక బాధ్యతల్లో ఉన్న అడ్లూరి ఇప్పుడు పార్టీని, ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపిస్తూ జీవన్ రెడ్డి విమర్శలకు కౌంటర్ ఇస్తూ ఆయనను ఎదుర్కొనేందుకు మరింత దూకుడుగా వెళ్లాల్సిన బాధ్యత అడ్లూరిపై ఉంది. అడ్లూరిపై ఇప్పుడు జగిత్యాల జిల్లా లో మరింత గురుతర బాధ్యత పడింది. దీన్ని సద్వినియోగం చేసుకొని కాంగ్రెస్ ను మరింత బలపరచడానికి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

**లాభిస్తున్న విపక్షాలు..**

**మున్సిపల్ ఎన్నికల ప్రభావం!**

కాంగ్రెస్‌లోని ఈ అంతర్గత విభేదాలు బీఆర్ఎస్, బీజేపీలకు వరంగా మారాయి. ఇప్పటికే రాయికల్ మున్సిపాలిటీలో పట్టు సాధించిన బీజేపీ, ఇప్పుడు జీవన్ రెడ్డి వర్గంలోని అసంతృప్త నేతలను ఆకర్షించే పనిలో పడింది. అటు బీఆర్ఎస్ కూడా జీవన్ రెడ్డి రాకతో జిల్లాలో మళ్లీ పుంజుకోవాలని చూస్తోంది. జీవన్ రెడ్డి వంటి ఉద్ధండుడు ప్రత్యర్థిగా మారిన వేళ.. మంత్రిగా అడ్లూరి తన పట్టును ఎలా నిలబెట్టుకుంటారు? జగిత్యాల ప్రజలు అనుభవాన్నే నమ్ముతారా లేక అధికార పక్షానికే జై కొడతారా? అనేది రానున్న రోజుల్లో తేలనుంది. మొత్తానికి జగిత్యాల రాజకీయాలు ఇప్పుడు సీనియర్–జూనియర్ మధ్య పోరు రసవత్తరంగా మారాయి.

# కాళేశ్వర రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కమిషన్ ఎదుట కేసీఆర్‌ను కూర్చోబెట్టటంలో రేవంత్ సక్సెస్ అయితే.. ఇలాంటి సమయంలో సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.





**ఇక్కడ సీఎం.. అక్కడ కేంద్రం.. సేమ్ వాయిస్**

60 ఏండ్లు దగాపడిన తెలంగాణకు గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఒకేసారి రాష్ట్రంలో సీఎం, కేంద్రంలో ఇరిగేషన్ మంత్రి విరుచుకుపడ్డారు. రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గట్టి కౌంటర్ ఇచ్చారు కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, ప్రజలకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని కేంద్రం స్పష్టం చేయడం బీఆర్ఎస్ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది.

**కూలేశ్వరం విమర్శలకు పెరిగిన బలం**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మొదటి నుండి కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని పిలుస్తూ వస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఆయన చేస్తున్న విమర్శలకు ఇప్పుడు కేంద్ర మంత్రి వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. లక్ష కోట్ల వ్యయం చేసినా ఫలితం శూన్యమని కేంద్రం సాక్షాత్తూ పార్లమెంటులో ప్రకటించడం ద్వారా.. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండు పార్టీలు బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని జాతీయ స్థాయిలో ముద్ర వేసినట్లయ్యింది. ఇది బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని పరిణామం.

**విచారణ నీడలో ప్రాజెక్టు భవిష్యత్తు**

బ్యారేజీల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే తీవ్రమైన లోపాలను ఎత్తి చూపింది. ఈ లోపాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అది నెమ్మదిగా సాగుతోందని మంత్రి పాటిల్ పేర్కొన్నారు. అటు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణ, ఇటు కేంద్ర సంస్థల నివేదికలు బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మీద కాళేశ్వరం అంశం బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద అడ్డంకిగా మారింది. అటు కాంగ్రెస్ రాష్ట్ర స్థాయిలో, ఇటు బీజేపీ జాతీయ స్థాయిలో ప్రాజెక్టు వైఫల్యాన్ని ఎండగడుతుండటంతో ఆ పార్టీ సమాధానం చెప్పుకోలేక సతమతమవుతోంది. కేవలం ఒక బ్యారేజీ కుంగిపోవడమే కాకుండా, లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దీనిని కవర్ చేసుకునే క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు మరింత వివాదాలకు దారితీస్తుండటంతో గులాబీ దళం ప్రస్తుతం తీవ్ర నిర్వేదంలో ఉంది.

**అతి పెద్ద ఇంజనీరింగ్ అద్భుతం నుంచి ఆర్థిక భారంగా**

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో గోదావరి నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అతి పెద్ద మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. దీన్ని 2016–2019 మధ్య కాలంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ ప్రాజెక్టు ప్రధాన నిర్మాణం జరిగింది. గోదావరి నది జలాలను ఎత్తిపోసి, తెలంగాణలోని 13 జిల్లాల్లో సుమారు 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు.., మరో 18.82 లక్షల ఎకరాలకు పాత ఆయకట్టు స్థిరీకరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టుపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే మూడు ప్రధాన బ్యారేజీలు ఉన్నాయి. మొత్తం 15 రిజర్వాయర్లతో 140–148 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. 20 లిఫ్ట్ స్టేషన్లలో 82 భారీ పంపును అమర్చారు. 1531 కిలోమీటర్ల పొడవైన కాలువలు, 203 కిలో మీటర్ల మేర భూగర్భ సొరంగాలు నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రోజూ 2 టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు మొత్తం 180 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. ఇందులో సాగునీటికి 134.5 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 30టీఎంసీలు, హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 30 టీఎంసీలు, పరిశ్రమలకు 16 టీఎంసీలు కేటాయించారు. ప్రాజెక్టు ప్రారంభంలో అంచనా వ్యయం 80,500 కోట్లు ఉండగా, కాలక్రమేణా అది 1.47 లక్షల కోట్ల వరకు పెరిగిందని కాగ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

2023లో కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన భాగమైన మేడ గడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇది కేవలం నిర్మాణ లోపమే కాకుండా, మొత్తం ప్రాజెక్టు డిజైన్, ప్లానింగ్‌లోనే లోపాలు ఉన్నాయని కేంద్రంతోపాటు, రాష్ట్రం నియమించిన ఘోష్ కమిషన్ అభిప్రాయపడింది. ఘోష కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ఈ కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసింది. ఇప్పుడు కేంద్రం వద్ద ఇది పెండింగ్‌లో ఉంది.

**ప్రభుత్వ ఖర్చుతోనే కాళేశ్వరం రిపేర్లు!**

కాళేశ్వరం బ్యారేజీల రిపేర్ల ఖర్చు ప్రభుత్వం భరిచడం కూడా ఖాయంగా కనిపిస్తోంది. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలకు రిపేర్లు చేసి, వీలైనంత త్వరగా వాడుకలోకి తీసుకురావాలని భావిస్తున్న రాష్ట్ర సర్కారు.. ఖర్చులను తానే భరించేందుకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే దెబ్బతిన్నాయి. ఆ డ్యామేజీలకు నిర్మాణ సంస్థలు రిపేర్లు చేయకపోవడం వల్లే 2023లో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని రిపోర్టులూ తేల్చాయి. రిపేర్లకు నిర్మాణ సంస్థలతోనే ఖర్చు పెట్టించాలని కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్, విజిలెన్స్ ఎంక్వైరీలు కూడా తేల్చి చెప్పాయి. సంస్థలు మాత్రం ప్రభుత్వ నోటీసులను తీసి పక్కనేశాయి. ఈ ఖర్చులను తాము భరించబోమని, ప్రభుత్వం మళ్లీ కొత్తగా అగ్రిమెంట్ చేసుకోవాల్సిందేనని ఎల్ అండ్ టీ కరాఖండిగా చెప్పేసింది. మరోవైపు బ్యారేజీలకు వీలైనంత త్వరగా రిపేర్లు పూర్తి చేయాలని ఇటీవల సీఎం చెప్పడంతో.. ఖర్చు ప్రభుత్వం భరించేందుకు సిద్ధమైంది.

### ఎందుకీ తొందర?

ఉన్నఫళంగా.. సీఎం రేవంత్ తీసుకున్న తాజా నిర్ణయం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. నిన్నటి దాకా ఈ ప్రాజెక్టు అంటేనే ఒక పనికి రాని ప్రాజెక్టుగా చూసిన సీఎం.. అలా ఢిల్లీకి వెళ్లివచ్చిన తర్వాత ఎందుకు మారిపోయారనేది ఎటూ తేలని ప్రశ్న. బీఆర్ఎస్‌కు ఈ ప్రాజెక్టు మరో ఆయుధంగా మారే అవకాశం ఉందని కేంద్రంలో ఎవరైనా ఉప్పందించారా అనే టాక్ కూడా ఉంది. దీనికితోడు కాళేశ్వరం జలాలు కూడా హైదరాబాద్ శివారు వరకు చేరాయి. ఇవి ప్రజల్లోకి వెళ్తే.. బీఆర్ఎస్‌కు కలిసి వచ్చే అంశమే. కానీ, బీఆర్ఎస్ అటు ఆలోచించకుండా సీఎం మరమ్మత్తులకు దిగుతున్నారు. లేదంటూ ఢిల్లీ ప్రభుత్వ పెద్దలు కేసీఆర్‌కు అనుకూలంగా మారుతున్నారనే సంకేతాలు వచ్చాయని కూడా మరో వర్గం టాక్. ఇలాంటి రాజకీయ పరిణామాల్లో సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం మాత్రం ఎటూ తేలని మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

### అనూహ్యంగా యూ టర్న్

ఇటీవల ఢిల్లీకి వెళ్లి వచ్చిన సీఎం రేవంత్.. అత్యవసరంగా తన నివాసంలో మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఇరిగేషన్ మీద.. ప్రధానంగా కాళేశ్వరం మీద సమీక్ష చేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టి, తిరిగి వినియోగంలోకి తేవాలని సీఎం అధికారులను ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సులకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. మరమ్మతు పనుల కోసం స్పెషల్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, అన్ని ఏజెన్సీలను అప్రమత్తంగా చేసి పనుల వేగం పెంచాలని సీఎం సూచించారు. జలవనరుల విభాగం, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీ నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టెంట్లతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని సహించబోమన్న సీఎం.. మరమ్మతు పనులకు నిధుల కొరత ఏమాత్రం ఉండబోదన్నారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మరమ్మతు పనులు మొదలైన తర్వాత తాను స్వయంగా అక్కడికి వచ్చి పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తానన్నారు.



## పంతాల మధ్య
# నలిగిన శాంతి

(మొదటి పేజీ తరువాయి)

ఆంక్షలను ఇరాన్ తోసిపుచ్చింది. మరోవైపు గల్ఫ్ దేశాలపై ఇరాన్ చూపిస్తున్న ఆధిపత్యాన్ని ఉగ్రవాద మూలాలున్న సంస్థలకు ఇస్తున్న మద్దతును అమెరికా తీవ్రంగా వ్యతిరేకించింది. జేడీ వాన్స్ మాట్లాడుతూ..

"ఇరాన్ వైఖరిలో ఎలాంటి సానుకూల మార్పు కనిపించడం లేదు. మా నిబంధనలకు వారు అంగీకరించనంత వరకు శాంతి సాధ్యం కాదు.' అని స్పష్టం చేశారు. దీనితో ఎలాంటి ఒప్పందం కుదరకుండానే అమెరికా బృందం వెనుదిరిగింది. ఇది భవిష్యత్తులో మరింత తీవ్రమైన ఘర్షణలకు దారితీసే సూచనగా నిపుణులు భావిస్తున్నారు.

**ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న చమురు సంక్షోభం**

ఇరాన్ కేవలం మాటలకే పరిమితం కాకుండా వ్యూహాత్మకంగా ప్రపంచానికి అతిపెద్ద షాక్ ఇచ్చింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేయడం లేదా అక్కడ ఆంక్షలు విధించడం ద్వారా క్రూడ్ ఆయిల్ సరఫరాను అడ్డుకుంటోంది. దీని ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అనేక దేశాల్లో ఇంధన కొరత ఏర్పడి ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం పొంచి ఉంది. రవాణా వ్యయం పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

**ఇజ్రాయిల్ పాత్ర.. యుద్ధ మేఘాలు**

ఈ వివాదంలో అమెరికాకు మిత్రదేశమైన ఇజ్రాయిల్ పాత్ర అత్యంత కీలకం. ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ వంటి కఠిన నిర్ణయాలు తీసుకునే నేతల అండ ఉండటంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై , సైనిక స్థావరాలపై మరింత భారీ దాడులు జరిగే అవకాశం ఉంది.

మరోవైపు ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. గల్ఫ్ ప్రాంతంలోని కీలక దేశాలపై ఒత్తిడి పెంచుతూ తన వ్యూహాలకు పదును పెడుతోంది. ఉగ్రవాద మూలాలున్న శక్తులకు కాపలాగా ఉంటుందన్న విమర్శలు ఉన్నప్పటికీ, తన ఉనికిని కాపాడుకోవడానికి ఇరాన్ ఎంతకైనా సిద్ధపడుతోంది.

**యుద్ధం తప్పదా?**

ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే శాంతి చర్చలు విఫలం కావడం ఒక పెద్ద హెచ్చరిక. ఇరు దేశాలు తమ పంతాలను వీడకపోతే గల్ఫ్ ప్రాంతంలో మరో భారీ యుద్ధం తప్పదనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఒకవేళ యుద్ధం గనక మొదలైతే, అది కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా గ్లోబల్ సంక్షోభంగా మారి ప్రపంచ శాంతిని చిన్నాభిన్నం చేస్తుంది. ప్రపంచ దేశాలు తక్షణమే జోక్యం చేసుకుని ఈ ఉద్రిక్తతలను తగ్గించకపోతే రాబోయే రోజులు మరింత భయంకరంగా ఉండే అవకాశం ఉంది.

## కాళేశ్వరం పునరుద్ధరణ పనులు
# వేగవంతం చేయాలి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పరిధిలోని మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు నీటిపారుదల రంగ నిపుణులు కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్ గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ కమిటీ వారానికి 2 సార్లు సమావేశమయి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షలు నిర్వహిస్తుందన్నారు. అవసరమైతే స్వయంగా తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సమావేశాల్లో పాల్గొని పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. అలాగే ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారి నియమించనున్నట్లు ఆదివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ వంటి చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ మూడు నిర్మాణాల్లో సమస్యలు ఒకే విధంగా ఉన్నాయన్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతుల పూర్తి ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను కీలకంగా పరిగణించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని, అదే సమయంలో మేడిగడ్డను కొంత భాగన్నీ పూర్తి చేయగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే డిజైన్ కన్సల్టెంట్‌గా ఏఎఫ్ఆర్‌వై ఇండియాను ఎంపిక చేసిందన్న మంత్రి.. ఐఐటీ ముంబైతో సంయుక్తంగా పని చేయాలని నిర్ణయించిందన్నారు. డిజైన్ బృందం రాత్రింబగళ్లు పనిచేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.డిజైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, డిజైన్ సిద్ధమైన వెంటనే సెంట్రల్ వాటర్ కమిషన్ (సొడబ్ల్యూసీ)కిఆమోదం కోసం పంపాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. సెక్రటరీ పరిక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపులో ఉండాలన్న ఆయన ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కన్సల్టెంట్లకు సూచించారు. డిజైన్ ప్రక్రియకు సంబంధించిన భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించబడతాయని మంత్రి తెలిపారు. అవసరమైన అన్ని పరీక్షలు, డేటా అత్యవసర ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఆదేశించారు.

**సిడబ్ల్యూపిఆర్ఎస్ కు అత్యధిక ప్రాధాన్యం**

పుణెలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ (సిడబ్ల్యూపిఆర్ఎస్ కు), ఈ పరీక్షలు, అధ్యయనాల బాధ్యత వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ – కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యున్నత ప్రాధాన్యంగా పరిగణించాలని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కేంద్ర జల కమిషన్‌తో సమన్వయం చేసి అవసరమైన అనుమతులు పొందాలని ఆయన సూచించారు. సిడబ్ల్యూపీఆర్ఎస్ కు సిబ్బంది 45 రోజుల పరీక్షల కాలంలో నిరంతరం ప్రాజెక్ట్ స్థలాల్లో ఉండాలని ఆదేశించారు. ఏజెన్సీలకు శిబిరాల పునఃప్రారంభం ఆదేశం ఎల్ అండ్ టీ సహా అమలు సంస్థలు తమ క్యాంపులు, మెస్ సదుపాయాలు, లాజిస్టిక్స్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఆయన చెప్పారు. ఇంజినీర్లు, టెక్నీషియన్లు, రిగ్ ఆపరేటర్లకు వసతి, ఆహార సమస్యలు రాకుండా చూడాలని ఆయన సూచించారు.ఇసుక తొలగింపు, జిపిఆర్ (భూభౌతిక) పరీక్షలు, సైట్ సిద్ధం పనులు అన్ని ఏజెన్సీల పూర్తి సహకారంతో నిర్వహించబడతాయన్నారు.డిజైనర్లు, సిడబ్ల్యూపిఆర్ఎస్ కు, శాఖ ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు కలిసి అన్ని పరీక్షలను ప్రత్యక్షంగా వీక్షించాలని, ప్రతి అంశాన్ని సక్రమంగా నమోదు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నీటిపారుదల శాఖా సలహాదారుడు ఆదిత్య దాస్ నాథ్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, టన్నెల్ నిపుణులు పరిక్షిత్ మెహ్రా, ఈఎన్‌సిలు రమేష్ బాబు, శ్రీనివాస్‌తో పాటు సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆదనపు డైరెక్టర్ సెల్వా బాలన్, తదితరులు సమావేశంలో ఉన్నారు.

# మహిళలకు మంచి రోజులు


**ముద్ర డెస్క్ :**

మహిళా రిజర్వేషన్ చట్ట (నారీ శక్తి వందన్ అధినియమ్) సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేఖ రాశారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని అన్నారు. విస్తృత సంప్రదింపుల అనంతరం నారీ శక్తి వందన్ అధినియమ్ అమలుకు సమయం ఆసన్నమైందనే నిశ్చితాభిప్రాయానికి వచ్చామని, 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తో నిర్వహించడం అనివార్యమని అని ఆ లేఖలో ప్రధాని పేర్కొన్నారు. మహిళలు, భవిష్యత్తు తరాల కోసం బాధ్యత తీసుకోవాలని పార్టీలను కోరారు. ఇందుకోసం పార్లమెంటులో చర్చను స్వాగతిస్తున్నామని చెప్పారు.

'మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును ఆమోదించే విషయంలో అందరినీ ఒకేతాటిపైకి రావాలని కోరేందుకు ఈ లేఖ రాస్తున్నాను. పార్లమెంటులో ఎక్కువ మంది తమ అభిప్రాయాల ను పంచుకోవడం అందరికీ గర్వకారణమవుతుంది. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా, మహిళలు, భవిష్యత్తు తరాల పట్ల బాధ్యతను చాటుకునే సందర్భమిది. మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని చాలాకాలంగా సభ్యులు కోరుతున్నారు. వారి ఆకాంక్షలు కార్యరూపంలోకి వచ్చే సమయం ఇప్పుడు వచ్చింది. 140 కోట్ల భారతీయులు, నారీశక్తి సాధించిన విజయం ఇది. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు అంతా కలిసికట్టుగా ముందుకు వస్తారనే పూర్తి నమ్మకం నాకు ఉంది' అని మోదీ ఆ లేఖలో పేర్కొన్నారు. మహిళలు ఎదిగేందుకు, నిర్ణయాలు తీసుకునేందుకు, ప్రత్యేకించి నాయకత్వం వహించేందుకు ఎంతగా అవకాశమిస్తే అంతగా సమాజం ప్రగతి పథంలోకి వెళ్తుందని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియా విజన్ సాకారం కావాలంటే ఈ ప్రయాణంలో మహిళలు కీలకమైన, చురుకైన పాత్ర పోషించడం అవసరమని అన్నారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ ప్రారంభించనున్నట్టు ఆ లేఖలో ప్రధాని తెలిపారు.

**మాంసంతో లాభాలు : ఇనుము ఎక్కువగా లభిస్తుంది**

రక్తహీనత తగ్గించడానికి మాంసం సహాయపడుతుంది. హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో ఉపయోగకరం.






# పుస్తకం మనిషికి మౌన గురువు

- టీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ముద్ర, హైదరాబాద్:**

మనిషికి మంచి గుణాలు నేర్పే మౌన గురువు పుస్తకమేనని, పుస్తకం చదవడమంటే కొత్త ప్రపంచాన్ని అనుభవించడమేనని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యుజే) రాష్ట్ర అధ్యక్షుడు కే. విరాహత్ అలీ అన్నారు. ఆదివారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో గల సేంట్ మేరీస్ ఉన్నత పాఠశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా "ఇంటింటా గ్రంథాలయం" అనే వినూత్న కార్యక్రమం ప్రారంభ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బాల్యం నుండే పుస్తకాలు చదివే అలవాటు కలిగి ఉన్న తాను, ఆ పుస్తకాలు అందించిన జ్ఞానంతోనే ఇవ్వాళ్టి సభలో నిర్భయంగా మాట్లాడ గలుగుతున్నానని విరాహత్ అలీ స్పష్టం చేశారు. జీవితంలో మనకు సరైన మార్గం చూపే నిజమైన స్నేహితుడు పుస్తకమేనని అన్నారు. నేటి సమాజంలో సాంకేతిక పోకడలతో పుస్తకాలకు విలువ లేకుండా పోతుందని, చారిత్రాత్మక ఎన్నో గ్రంథాలయాలు నేడు నిరాదరణకు గురవ్వడం విచారకరమన్నారు. ఈ క్రమంలోనే పుస్తకాల పఠనకు పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్న సేంట్ మేరీ పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్, పాఠశాల కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



# తెలంగాణలో భేషజాలు లేని ప్రభుత్వం



- మంత్రి శ్రీధర్ బాబు

**ముద్ర, సిద్దిపేట:**

రాష్ట్రాభివృద్ధి.. పార్టీలకతీతంగా ప్రజా సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి బేషజాలు లేవని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో రూ. 210 కోట్లతో నిర్మించనున్న జూనో జ్యూల్ బయో ఫ్యూయల్ ఫ్యాక్టరీ మొదటి దశ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అన్ని ప్రాంతాలు వర్గాలు బాగు పడాలన్నదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. అందుకే గత ప్రభుత్వంలో చేపట్టిన మంచి పనులను కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. పరిశ్రమ ఏర్పాటు కోసం ఆన్లైన్లో రెండు నెలల క్రితం దరఖాస్తు చేసిందే తరువాయి పారదర్శకంగా అనుమతులు ఇచ్చి పరిశ్రమ ప్రారంభించినట్లు చెప్పారు.

**రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలి**

పరిశ్రమల ఏర్పాటుకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభమయ్యాయని స్పష్టం చేశారు. సాగునీరు రావడంతో జిల్లాలో 80 వేల ఎకరాల్లో వరి సాగవుతుందని అన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం నేపథ్యంలో కొరత నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో బయో గ్యాస్ ప్లాంట్ ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు దేశానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

**- మాజీ మంత్రి హరీష్ రావు**

**తెలంగాణ వారికి ఆంధ్రాలో సహకరించాలి..**

**- వీహెచ్**

తెలంగాణ వారికి ఆంధ్రప్రదేశ్ లో అవకాశాలు ఇవ్వాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ ఆంధ్ర ప్రజలు అన్నదమ్ములు విడిపోయినట్టు స్పష్టం చేశారు. తెలంగాణలో ఆంధ్ర ప్రాంత పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించడం శుభ పరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ వారు ఎవరైనా పరిశ్రమ స్థాపనకు ముందుకు వస్తే సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. తెలుగు వారందరూ ఒకటిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భువనేశ్వర్ కలిత, పర్యావరణ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఎన్. కె. ప్రేమచంద్రన్, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, జూనో జ్యూల్ బయో ఫ్యూయల్ ఫ్యాక్టరీ సీఈవో నాగ శరత్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కు లీడర్, క్యాడర్ లేదు

- ఆ పార్టీ తో ఎన్నటికీ పొత్తు ఉండదు
- కేటీఆర్, రేవంత్ రెడ్డిలు బీజేపీని దెబ్బతీసే కుట్ర
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

**ముద్ర, నిజామాబాద్:**

లీడర్, క్యాడర్ లేని బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ ఎప్పటికీ పొత్తు పెట్టుకోబోదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. కరప్షన్, అహంకారం, డ్రగ్స్ పార్టీతో మాకేంటి పొత్తు అని దుయ్యబట్టారు. ఆదివారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్, రేవంత్ రెడ్డిఇ ద్దరూ ఒక్కటేనని చెప్పారు. బీజేపీని దెబ్బతీసేందుకు ఈ ఇద్దరు కలిసి డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కు పదేళ్లు సీఎంగా అవకాశం ఇస్తే సెక్రటేరియట్ కు రాలేదని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా అవకాశం ఇస్తే ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగుపెట్ట లేదన్నారు. అలాంటప్పుడు ఆయన రాజకీయాల్లో ఎందుకని నిలదీశారు. అలాంటి కేసీఆర్ తో మాకు పొత్తు ఏంటన్నారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఏం చేశారో ఆయన కూతురు కవితనే చెబుతున్నారు కదా అని ప్రశ్నించారు. ఇటు కవిత పార్టీకి సీఎం రేవంత్ రెడ్డి ఫండింగ్ ఇస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. కులాల వారీగా హిందువులను విడదీసేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేయిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొంగ పొత్తులతో బీజేపీని దెబ్బ తీయడానికి ప్రణాళికలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కేటీఆర్ ను రేవంత్ రెడ్డి ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. త్వరలో బీఆర్ఎస్ నుంచి బీజేపీకి భారీగా వలసలు ఉండబోతున్నాయని జోస్యం చెప్పారు. ఎవరిని పార్టీలోకి తీసుకోవాలి.. ఎవరిని తీసుకోవద్దనే విషయంలో బీజేపీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారన్నారు.

**బీజేపీలో గ్రూప్‌లు లేవు..**

తెలంగాణ బీజేపీలో గ్రూప్ రాజకీయాలపై అర్వింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో ఎలాంటి గ్రూప్ లు లేవని స్పష్టం చేశారు చిన్న చిన్న సమస్యలు అన్ని పార్టీల్లోనూ ఉంటాయన్నారు. రాకేశ్ రెడ్డితో నాకెలాంటి విభేదాలు లేవని చెప్పారు. బీజేపీలో లేఖల అంశంపై స్పందిస్తూ.. తాను ఎలాంటి చిట్ చాట్ చేయనని చెప్పారు. తాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేయనన్నారు. అధిష్టానానికి ఎవరూ లేఖలు రాయలేదన్న ఆయన.. ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. 2029లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతోందన్నారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ లో చేరే విషయంలో తొందరపడ్డారని అభిప్రాయపడ్డారు.





## పంట మార్పిడి చేస్తే కొనే పరిస్థితి లేదు

- మాజీ మంత్రి హరీశ్ రావు

**ముద్ర, సిద్ధిపేట :**

పంట మార్పిడి చేయమని చెబుతున్న కాంగ్రెస్ సర్కార్.. రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ది రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం అని అన్నారు. వడగళ్లు, వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలన్నారు. ఆదివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. పంట కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్లను ప్రారంభించలేదని.. వెంటనే కొనుగోలు సెంటర్లను ప్రారంభించి, మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# బాబు డైరెక్షన్ లో రేవంత్ పాలన

- చంద్రబాబు మెప్పు కోసం కాళేశ్వరం పై కుట్రలు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**ముద్ర, జగిత్యాల:**



రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా కాకుండా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో నడుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం చంద్రబాబు మెప్పు పొందడం కోసమే రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీని ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీకి రిపేర్లు చేయకుండా కాలయాపన చేయడంతో రాష్ట్ర ప్రయోజనాలకు గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావం పడి, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడితే మేడిగడ్డ లేని లోటు ఏంటో ప్రజలకు అప్పుడు స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. ఆ సమయంలో ప్రజలు పడే ఇబ్బందులను చూసి రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం ఎప్పటికీ క్షమించదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేయడంతో భవిష్యత్తులో సాగునీరు, తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర రైతాంగాన్ని బలి చేయొద్దని రేవంత్ రెడ్డిని కోరిన జీవన్ రెడ్డి.. వెంటనే మేడిగడ్డ బ్యారేజీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


## మహిళా బిల్లుకు మద్దతిచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

**ముద్ర, కరీంనగర్:**

మహిళా సాధికారత గురించి మాట్లాడే పార్టీలన్నీ పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ బిల్లును వ్యతిరేకించే పార్టీలకు మహిళలే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలకు చట్ట సభలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనేది దశాబ్దాల నాటి కల అని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. డీలిమిటేషన్‌తో పార్లమెంట్‌లో స్థానాలు పెరుగుతాయన్న ఆయన ఈ బిల్లుతో తెలంగాణలోనూ 60 మంది మహిళలు అసెంబ్లీలో అడుగుపెట్టే అవకాశం ఉంటుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు కోరుతూ అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లేఖ రాశారని చెప్పారు. వ్యక్తులు, పార్టీలకు అతీతంగా చట్టాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలను మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో నిర్వహిద్దామని అన్నారు.

# కాకతీయుల నాటి విగ్రహాలు వెలుగులోకి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



చారిత్రక ఆధారాలున్న నిర్మల్ లో మరో కీలక ఆధారం వెలుగు లోకి వచ్చింది. ఇప్పటికే శాతవాహన, రాష్ట్రకూట, చాళుక్య, కాకతీయ రాజవంశాల పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందినట్లు అనేక శాసనాలు, ప్రతిమలు, లిఖిత ఆధారాలు లభ్యమయ్యాయి. తాజాగా నిర్మల్ పట్టణ సమీపంలో గండి రామన్న క్షేత్రం వద్ద రాతి గుట్టల మధ్య సహజ గుహలో కాకతీయుల కాలానికి చెందిన రెండు ఉమామహేశ్వర విగ్రహాలను గుర్తించినట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డా. తుమ్మల దేవరావు తెలిపారు. నల్లటి కఠిన శిల (బసాల్ట్)పై చెక్కిన ఈ విగ్రహాలు సుమారు క్రీ.శ. 10 నుంచి 11వ శతాబ్దాల మధ్య కాలానికి చెందినవిగా అంచనా వేస్తున్నారు. ఒక విగ్రహంలో ఉమాదేవి లలితాసనంలో శివుని ఒడిలో కూర్చుని ఉండగా, శివుడు జటాజూటధారిగా, శాంత స్వరూపంతో దర్శనమిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన చేతుల్లో ఢమరుకం, త్రిశూలం స్పష్టంగా కనిపిస్తున్నాయని వివరించారు. శిల్పకళలో శివ పార్వతుల కాళ్లకు అందెలు, పట్టగొలుసులు, కర్ణాభరణాలు వంటి ఆభరణాలు సున్నితంగా చెక్కబడి ఉన్నాయన్నారు. విగ్రహం అడుగుభాగంలో శివుని వాహనం నంది ప్రతిష్ఠితంగా కనిపిస్తుందని తెలిపారు. కాగా ఇదే గుహలో మరో ఉమామహేశ్వర విగ్రహం నంది వాహనంపై విరాజిల్లుతున్న దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అటవీ ప్రాంతంలో ఉన్న సహజ రాతి గుహలో ఈ విగ్రహాలు వేల సంవత్సరాలుగా నిలిచి ఉండటం విశేషంగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అబ్బిడి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ పేరు మార్చి నష్టపోయాం




- భవిష్యత్తులో టీఆర్ఎస్ గానే కొనసాగుతాం
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, మంచిర్యాల:**

టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి తాము రాజకీయంగా చాలా నష్టపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన గులాబీ జెండా, టీఆర్ఎస్ పేరుకు ఉన్న సెంటిమెంట్ విడదీయలేనిదన్న ఆయన మళ్లీ పార్టీని టీఆర్ఎస్ గానే చూడాలని, పాత పేరుతోనే ముందుకు సాగాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ విషయంపై పార్టీలో అంతర్గత చర్చలు జరుపుతున్నట్లు సంకేతాలిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలో పర్యటించిన ఆయన, క్యాతనపల్లి నూతన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, గత నిర్ణయాలపై ఆయన స్పందించారు. రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలోనే ఉంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పార్టీని మళ్లీ బలోపేతం చేయడమే తమ లక్ష్యం అన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కన్నవారిని కన్నీళ్లు పెట్టించకు**

- కవిత కు కేటీఆర్ సూచన

**ముద్ర, హైదరాబాద్:**



కవిత ప్రవర్తనతో కుటుంబ సభ్యులు తరచూ మనస్తాపానికి గురవుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. గత కొంతకాలంగా తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన కల్వకుంట్ల కవిత 'కొత్త పార్టీ' అంశంపై కేటీఆర్ తొలి సారిగా స్పందించారు. ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా కవితకు సూచనలు చేశారు. తల్లిదండ్రులకు మనం మేలు చేయకపోయినా పర్వాలేదు కానీ, వారు బాధపడే పనులు మాత్రం చేయకూడదన్నారు. ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదన్నారు. కవిత చాలా తెలివైన మహిళ, ఆమెకు రాజకీయాలపై మంచి అవగాహన ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆమె ఇలా ప్రవర్తించడం ఏమాత్రం కరెక్ట్ కాదు. ఇకనైనా తన వైఖరిని మార్చుకోవాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
13.04.2026 సోమవారం, హైదరాబాద్



మీ 'ముద్ర' వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# బ్రిటిష్ పాలకుల దురహంకార మారణహోమం

**జలియన్‌వాలా భాఘ్ దుర్ఘటన**
**(13 ఏప్రిల్ "జలియన్‌వాలా భాఘ్ నరమేధ దుర్ఘటన దినం" సందర్భంగా..)**

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో జలియన్‌వాలా భాఘ్ మారణహోమం ఒక అత్యంత విషాదకరమైన ఘటనగా నిలిచింది. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని అమృత్‌సర్ నగరంలో జరిగిన ఈ దుర్ఘటన బ్రిటీష్ పాలకుల క్రూరత్వానికి నిదర్శనం.బైసాఖీ పండుగ సందర్భంగా వేలాది మంది ప్రజలు శాంతియుతంగా జలియన్‌వాలా భాఘ్‌లో సమావేశమయ్యారు. వారు రౌలట్ చట్టంకు వ్యతిరేకంగా నిరసన తెలపడానికి చేరుకున్నారు. అయితే, ఆ సమావేశాన్ని అణచివేయడానికి బ్రిటిష్ అధికారి రెజినాల్డ్ డైయర్ తన సైన్యంతో అక్కడికి చేరుకొని, ఎలాంటి హెచ్చరిక లేకుండా కాల్పులు జరిపించాడు. దాదాపు 10 నిమిషాల పాటు కొనసాగిన ఈ కాల్పుల్లో వందలాది నిరపరాధ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు, వేలాది మంది గాయపడ్డారు. బయటకు వెళ్లే మార్గాలు లేకపోవడంతో ప్రజలు తోటలోని బావిలోకి దూకి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి.ఈ మారణహోమం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలించింది. ముఖ్యంగా భగత్ సింగ్ వంటి యువ దేశభక్తులలో స్వాతంత్ర్య దీక్షను మరింత బలపరిచింది. అనంతరం సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమాలు వేగం పుంజుకుని, స్వాతంత్ర్య పోరాటానికి నూతన దిశను చూపించాయి.జలియన్‌వాలా భాఘ్ ఘటన మనకు స్వేచ్ఛ ఎంత విలువైనదో గుర్తుచేస్తుంది. ఆ అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి మనస్ఫూర్తిగా నివాళులు అర్పించడం ప్రతి భారతీయుడి బాధ్యత. జై హిండ్!



- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037



# కోతుల బెడదకు సామాజిక అడవుల పెంపకమే శాశ్వత పరిష్కారం

నేడు కోతుల బెడద దేశవ్యాప్తంగా తీవ్రమైన సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంటోంది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటడం, పంటలు నాశనం కావడం, పిల్లలు-పెద్దలు గాయపడే ఘటనలు పెరగడం వంటి పరిణామాలు సాధారణంగా మారుతున్నాయి.గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా కోతుల దాడులు పెరిగి ప్రజలలో భయాందోళన నెలకొంటోంది. దీని వల్ల సాధారణ జీవనం కూడా దెబ్బతింటోంది.ఈ పరిస్థితికి ప్రధాన కారణం మనుషుల చేత ప్రకృతి సమతుల్యం భంగం కావడమే. స్వార్ధ ప్రయోజనాల కోసం అడవులను నరికివేయడం, నదుల్లో అధిక ఇసుక తవ్వకాలు, కొండలు-గుట్టలను ధ్వంసం చేయడం వంటి చర్యలు ప్రకృతిపై తీవ్రమైన ప్రభావం చూపాయి. దీంతో కోతుల సహా అనేక జీవరాశుల నివాసాలు నాశనం అయ్యాయి. అడవుల్లో లభించాల్సిన పండ్లు, నీటి వనరులు లేక కోతులు ఆకలితో, దాహంతో జనావాసాల వైపు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఆహారం, నీటి కోసం గ్రామాల్లోకి ప్రవేశించిన కోతులు ఇళ్లపై దాడులు చేయడం, పంటలను పాడుచేయడం, చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు చేయడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఫలితంగా మనుషులకూ, జంతువులకూ పరస్పర ప్రమాదం పెరిగింది. ఇది కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాకుండా దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ప్రజలు కోతుల నుంచి రక్షించుకోవడానికి ఎన్నో మార్గాలు ప్రయత్నిస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం దొరకడం లేదు.కొన్ని ప్రాంతాల్లో కోతులను పట్టి మరొకచోట వదిలివేయడం వంటి తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇది సమస్యను తగ్గించకుండా మరో ప్రాంతానికి మళ్లించడం మాత్రమే అవుతోంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు కోతుల సమస్యను పరిష్కరిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ, ఆ హామీలు అమలులోకి రావడం లేదు. దీంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

ఈ సమస్యకు మూల కారణం ప్రకృతి నాశనం కావడం కావున, పరిష్కారం కూడా ప్రకృతి పరిరక్షణ ద్వారానే సాధ్యమవుతుంది. అడవులను పునరుద్ధరించడం అత్యవసరం. ముఖ్యంగా కోతులకు ఆహారం అందించే పండ్ల చెట్లను విస్తృతంగా నాటాలి. నేరేడు, మారేడు, ఉసిరి, తాని, కరకకాయల చెట్లు, అలాగే తునికి, మర్రి, జీడి, మామిడి, సపోటా వంటి పండ్ల వృక్షాలను అడవుల్లో పెంచితే కోతులకు సహజ ఆహారం లభిస్తుంది.అదే విధంగా నదుల్లో నియంత్రిత ఇసుక తవ్వకాలు, కొండలు-గుట్టల రక్షణ, అక్రమ తవ్వకాల నియంత్రణ వంటి చర్యలు తీసుకోవాలి. రోడ్ల నిర్మాణం పేరుతో చెట్లను నిర్లక్ష్యంగా నరికి వేయడం వంటి విధానాలను నిలిపివేయాలి.మొక్కల నాటకం పేరుతో కేవలం లెక్కలు చూపే కార్యక్రమాలకంటే, వాటి సంరక్షణపై దృష్టి పెట్టాలి.ఈ కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా, స్వచ్ఛంద సంస్థలు,గిరిజన సమూహాలు,స్థానిక ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలి. అడవులపై ఆధారపడే గిరిజనులకు పండ్ల వృక్షాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పర్యావరణ సమతుల్యం కూడా కాపాడవచ్చు.మన ఋషులు చెప్పినట్లుగా ప్రకృతిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమే. కాబట్టి ఇప్పటికైనా చిత్తశుద్ధితో అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడితే కోతుల సమస్యతో పాటు అనేక పర్యావరణ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.



కోరబోయిన రమేష్ పటేల్
అధ్యక్షులు
కపిల మహర్షి గోశాల,
(బట్టుపల్లి) మంథని.
9849312891.

# పాటకు ప్రాణం పోసిన దిగ్గజ గాయని ఆశా భోంస్లే:




తండ్రి దీనానాథ్ మంగేష్కర్ మరణం తర్వాత, కేవలం తొమ్మిదేళ్ల వయసులోనే కుటుంబం కోసం గొంతు విప్పారు.అక్క లతా మంగేష్కర్ నీడలో ఉండిపోకుండా, తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకోవడానికి ఆమె చేసిన పోరాటం సామాన్యం కాదు.1943లో తొలి పాట రికార్డ్ చేసిన ఆమె,1950ల నాటికి బాలీవుడ్‌లో తిరుగులేని గాయనిగా ఎదిగారు. 1960, 70వ దశకాల్లో హిందీ సినిమాల్లో డ్యాన్స్ పాటలకు ఆశా భోంస్లే గొంతు ఉండాల్సిందే. ముఖ్యంగా నటి హెలెన్ కోసం ఆమె పాడిన పాటలు చరిత్ర సృష్టించాయి.ప్రియా తూ అబ్ తో ఆజా (కారవాన్)యే మేరా దిల్ (డాన్)దమ్ మారో దమ్ (హరే రామ హరే కృష్ణ) ఓ హసీనా జుల్ఫోవాలీ (తీస్రీ మంజిల్) ఇలాంటి అనేక పాటలు ఆమెను డ్యాన్స్ సాంగ్స్ క్వీన్‌గా నిలబెట్టాయి. ఆ తర్వాత మెలోడీ క్వీన్ గానూ ఎదిగారు.

**తెలుగు సినీ రంగంలోను**

ఆమెకు విడదీయరాని అనుబంధం ఉంది. చంటిలో ఓ ప్రేమ, చందమామ సినిమాలోని నాలో ఊసులకు నాలో ఊహలకు, అశ్వమేధం లో శీతాకాలం ప్రేమకు ఎండాకాలం అనే పాటలతో తెలుగు ప్రేక్షకుల మనసును కూడా దోచుకుంది. ఆశా భోంస్లే అంటే కేవలం ఒక గాయని మాత్రమే కాదు, ఆమె ఒక ప్రయోగశాల.తొలినాళ్లలో కేవలం క్యాబరే లేదా ఐటమ్ సాంగ్స్‌కే ఆమె పరిమితమని కొందరు భావించినా, 'ఉమ్రావ్ జాన్' వంటి చిత్రాల్లో ఆమె ఆలపించిన గజల్స్ విమర్శకుల నోళ్లు మూయించాయి. ఏడుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, 'మేరా కుచ్ సామాన్' వంటి అమర గీతాలకు రెండు జాతీయ అవార్డులు ఆమె ప్రతిభకు నిదర్శనాలు.12 వేలకు పైగా పాటలతో గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకున్నా,ఆమె ఎప్పుడూ ఒక విద్యార్థిలాగే ఉండేవారు. "నేను నేర్చుకోవాలంటే భీమ్ సేన్ జోషి గారి పాటలు వింటాను" అని ఆమె చెప్పిన మాటలు ఆమె వినయానికి నిదర్శనం ఆమె వ్యక్తిగత జీవితం ఎన్నో ఒడిదుడుకులతో సాగింది. 16 ఏళ్ల వయసులో కుటుంబ అభీష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్న ఆమె, అత్తమామల వేధింపులతో ముగ్గురు పిల్లలతో ఒంటరిగా బయటకు వచ్చారు.ఆ తర్వాత 1980లో సంగీత మాంత్రికుడు రాహుల్ దేవ్ బర్మన్ (ఆర్డీ బర్మన్)తో ఆమె సాగించిన ప్రేమ ప్రయాణం మరపురానిది. అయితే 1994లో ఆయన మరణం ఆమెను తీవ్రంగా కుంగదీసింది. గుండెలో ఎంత బాధ ఉన్నా, గొంతులో మాత్రం మధురాన్నే పలికించిన ధీశాలి ఆమె. బ్లాక్ అండ్ వైట్ తెర నుంచి ఇప్పటి వరకు ఆమె పాటకు జనం నీరాజనం పలికారనే చెప్పాలి.పాత పాటలే కాకుండా 90వ, 2000వ దశకం ప్రారంభంలో, భోస్లే ఆధునిక, పాప్‌ప్రభావిత సంగీతాన్ని స్వీకరించి, తన కెరీర్ ను రీస్టార్ట్ చేసుకున్నారు. ఏఆర్ రెహమాన్ తో ఆమె చేసిన.. తన్హా తన్హా, రంగీలా రే.. వంటి ఐకానిక్ పాటలతో మంత్రముగ్ధులను చేశారు. రాత్ అకేలీ హై రీమిక్స్, జరా సా జూమ్ లూ మై.. తన మార్క్ చూపించారు. జనత్ఎజహాన్, కభీ తో నజర్ మిలావో వంటి ఇండిపాప్ హిట్లతో ఆమె తన లెజెండరీ హోదాను కొనసాగిస్తూ వచ్చారు. ఆమె రికార్డుల విషయానికొస్తే.. 20కి పైగా భారతీయ మరియు విదేశీ భాషల్లో సుమారు 12,000కు పైగా పాటలు పాడి, అత్యధిక స్టూడియో రికార్డింగ్స్ చేసిన గాయనిగా 2011లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. భారత ప్రభుత్వం ఆమెను 2000లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుతో, 2008లో పద్మ విభూషణ్‌తో గౌరవించింది. జీవిత చరమాంకంలో ఆమె మనవరాలు జనై భోంస్లే ఆమెకు నీడలా నిలిచారు. బామ్మ అడుగు జాడల్లో నడుస్తూ గాయనిగా ఎదుగుతున్న జనై, ఆశా గారి చివరి రోజుల్లో నిరంతరం తోడుగా ఉండి సేవలు అందించారు. ఆశా భోంస్లే భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె పాడిన ప్రతి పాటలోనూ ఆమె ప్రాణం సజీవంగానే ఉంటుంది. భారతీయ సంగీతం ఉన్నంత వరకు ఆశా భోంస్లే అనే పేరు ధ్రువతారలా మెరుస్తూనే ఉంటుంది.


* సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
* స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
* 9000674747



# వృద్ధాప్య భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. న్యాయ వ్యవస్థ నిర్వేదం!

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం వారికి చెల్లించాల్సిన ప్రయోజనాల విషయంలో నెలకొన్న జాప్యం, నిర్లక్ష్యం, పరిపాలనా లోపాలపై హైకోర్టు గట్టిగా స్పందించడం ఇటీవలి కాలంలో పరిపాలనా వ్యవస్థపై విస్తృత చర్చకు దారి తీసింది. జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత వారికి రావాల్సిన కేపీఎఫ్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, ఆర్జిత సెలవులు (లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్), గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి కీలక ఆర్థిక ప్రయోజనాలు నెలలు, కొన్ని సందర్భాల్లో సంవత్సరాల పాటు పెండింగ్‌లో ఉండటం ఒక తీవ్రమైన సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, ఏప్రిల్ 9లోగా అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తిస్థాయిలో చెల్లించాలని హైకోర్టు స్పష్టమైన గడువు విధించడం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలిస్తే, రాష్ట్రంలోని పలు శాఖలకు చెందిన పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించడం ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్ వంటి శాఖలకు చెందిన ఉద్యోగులు తమ ఆర్థిక ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. కొందరికి ఆరు నెలలు, మరికొందరికి ఒకటి నుంచి రెండు సంవత్సరాలపాటు కూడా బకాయిలు అందకపోవడం వల్ల వారి జీవన విధానం తీవ్రంగా ప్రభావితమైందని వారు వాదించారు. ఈ నేపథ్యంలో దాఖలైన సుమారు 572కి పైగా కోర్టు ధిక్కరణ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

విచారణ సందర్భంగా ప్రభుత్వ తరఫున 3,656 టోకెన్లు జారీ చేశామని, అందులో 1,056 చెల్లింపులు పూర్తయ్యాయని, మిగిలిన 2,600 టోకెన్లకు చెల్లింపులు చేయాల్సి ఉందని వివరించారు. అలాగే 758 కేసుల్లో 737 మందికి చెల్లింపులు చేశామని ప్రభుత్వం పేర్కొంది. అయితే కోర్టు ఈ వాదనలను పూర్తిగా అంగీకరించలేదు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ, ఒక్కో ఉద్యోగికి 2 నుంచి 10 వరకు వేర్వేరు హెడ్ల కింద టోకెన్లు జారీ అయ్యాయని, వాటిలో కొన్నింటికి మాత్రమే చెల్లింపులు జరిగి, మిగిలినవి నిలిపివేశారని వివరించారు. కొందరికి కేవలం 20 శాతం వరకు మాత్రమే చెల్లింపులు అందాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు "పాక్షిక చెల్లింపులు సరిపోవు, పూర్తిస్థాయిలో చెల్లించాల్సిందే" అని స్పష్టం చేసింది. ఏప్రిల్ 9లోగా చెల్లింపులు పూర్తి చేయాలని ఇచ్చిన గత ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేయక పోవడంపై కోర్టు తీవ్రంగా స్పందించింది. "ఒక్కటి పెండింగ్ ఉన్నా గత ఉత్తర్వుల ప్రకారం సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందే" అని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియాకు స్పష్టంగా హెచ్చరించింది. కోర్టు మరోసారి గడువు ఇస్తున్నప్పటికీ, దాన్ని అలుసుగా తీసుకోరాదని, కోర్టుతో ఆటలు ఆడకూడదని ఘాటుగా వ్యాఖ్యానించింది. హైకోర్టు తన పరిశీలనలో ఒక కీలకమైన అంశాన్ని ప్రస్తావించింది——పెన్షన్, రిటైర్మెంట్ ప్రయోజనాలు అనేవి ఉద్యోగి హక్కులు గానీ, ప్రభుత్వం ఇచ్చే దయాధర్మం కాదని. ఉద్యోగి సేవలు పూర్తయిన వెంటనే ఈ చెల్లింపులు జరగాల్సిందేనని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు గత తీర్పులను ఉటంకిస్తూ, పెన్షన్ చెల్లింపుల్లో జాప్యం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు సమానమని పేర్కొంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న ఉద్యోగులు తమ జీవిత అవసరాలకు ఈ నిధులపై ఆధార పడతారని, చెల్లింపుల్లో ఆలస్యం వారి గౌరవాన్ని దెబ్బతీస్తుందని కోర్టు అభిప్రాయ పడింది. "రెగ్యులర్ ఉద్యోగులకు ఒక నెల జీతం ఆగినా వారు కొంతవరకు ఎదుర్కోగలరు. కానీ పదవీ విరమణ చేసినవారికి రావాల్సిన సొమ్ము నిలిపివేయడం అనుమతించలేము. అది ప్రభుత్వ సొమ్ము కాదు, వారి సొంత సొమ్ము" అని కోర్టు స్పష్టం చేసింది. పిల్లల చదువులు, వివాహాలు వంటి కీలక అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడాల్సి ఉండగా, చెల్లింపులు ఆలస్యం కావడం వల్ల వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించింది. గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్రంలో ప్రతి ఏడాది సుమారు 60 వేల నుంచి 80 వేల వరకు ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. వీరిలో కనీసం 30 నుంచి 40 శాతం మంది రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులో ఆలస్యం ఎదుర్కొంటున్నట్లు అంచనా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఖజానా లోటు, నిధుల ప్రాధాన్యత మార్పు వంటి కారణాలతో ఈ చెల్లింపులు వాయిదా పడుతున్నాయి. ఒక అంచనా ప్రకారం, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం విలువ వేల కోట్ల రూపాయలకు చేరుకుంది. ఇందులో గ్రాట్యుటీ, కమ్యుటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డిఎ బకాయిలు ప్రధాన భాగం. ఇక ఉపాధ్యాయ సంఘాల నేతల సమాచారం ప్రకారం, కోర్టును ఆశ్రయించిన వారికి పాక్షిక చెల్లింపులు జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇది పూర్తి పరిష్కారం కాదని, ఇంకా అనేకమంది తమ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని వారు పేర్కొంటున్నారు. కోర్టుకు వెళ్లని వారు కూడా వేలల్లో ఉన్నారని, వారికి కూడా ఈ ప్రయోజనాలు అందాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. విచారణను జూన్ 10కి వాయిదా వేసిన హైకోర్టు, ఆ తేదీకి ముందు ప్రతి పిటిషనర్‌కు పూర్తి చెల్లింపులు జరిపి, పిటిషన్ వారీగా వివరాల నివేదికలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇది పరిపాలనా యంత్రాంగానికి ఒక కీలక పరీక్షగా మారింది. ఈ ఆదేశాల నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వేగంగా క్లియర్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడింది. ఈ పరిణామాల ప్రభావం పరిపాలనా వ్యవస్థపై గణనీయంగా పడే అవకాశం ఉంది. మొదటిగా, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు న్యాయ వ్యవస్థ ఎంతగానో కట్టుబడి ఉందనే సంకేతం వెలువడింది. రెండవది, భవిష్యత్తులో ఇలాంటి జాప్యాలను నివారించేందుకు ప్రభుత్వ శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మూడవది, ఆర్థిక ప్రణాళికలో రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం స్పష్టమైంది. మొత్తం మీద, రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపుల విషయంలో హైకోర్టు జోక్యం ఒక మలుపుతిప్పే సంఘటనగా నిలిచింది. ఇది కేవలం ఒక కేసుకు సంబంధించిన తీర్పు మాత్రమే కాదు, పరిపాలనా బాధ్యతలను గుర్తు చేసే గట్టిపాఠంగా నిలుస్తోంది. జీవితాంతం సేవలందించిన ఉద్యోగులకు వారి హక్కులను సమయానికి అందించడం ప్రభుత్వ ధర్మమనే భావనను ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఈ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందా లేదా అనేది ప్రభుత్వ చర్యలపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం——ఉద్యోగుల హక్కులను నిర్లక్ష్యం చేయడం ఇకపై సహించబోదని న్యాయ వ్యవస్థ గట్టిగా చెప్పింది.




రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 13.04.2026
www.mudranews.in | @mudranews



## మాసంతో లాభాలు




విటమిన్ B12 మంచి మూలం నాడీ వ్యవస్థ, మెదడు పనితీరుకు B12 అవసరం. ఇది ఎక్కువగా జంతు ఆహారాల్లో మాత్రమే లభిస్తుంది.

## సంక్షిప్తంగా..

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** తిమాజీపేట మండలంలోని ప్యాక్స్ వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సరైన ధరలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇలాంటి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మరింత మద్దతు లభిస్తుందని పేర్కొన్నారు. .ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మండల అధ్యక్షుడు వివేక్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవ్, వెంకట్ రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, హర్ష వర్ధన్ రెడ్డి, ముబ్బరక్, రవీందర్ రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

### చెన్నకేశవ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



**ముద్ర, కాప్రా:** కాప్రా డివిజన్ పరిధిలోని చెన్న కేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ స్వామివారి ఆశీస్సులు అందరి మీద వుండాలి అని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### 15న వేసెక్టమీ శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు గది నెంబర్ 22లోని పి.పి. యూనిట్‌లో పురుషులకు కోతకుట్లులేని ఎన్ఎస్‌వీ పద్ధతిలో వ్యాసెక్టమీ ఆపరేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి తెలిపారు. ఆపరేషన్ చేయించుకునే వారు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తక జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు ఆసుపత్రి హెల్ప్ డెస్క్ ఇన్‌చార్జ్ టి. యాదగిరిని నేరుగా లేదా సెల్ నెంబర్లు 90149 32408, 99892 21518లో సంప్రదించాలని కోరారు. ఈ శిబిరంలో ఆపరేషన్ చేయించుకున్న వారికి ప్రోత్సాహకంగా రూ.1000 నగదు అందజేయనున్న డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి తెలిపారు.

### 165వ సారి రక్త దానం



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణానికి చెందిన బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత, బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ 165వ సారి రక్తదానం చేసి ప్రాణాపాయస్థితిలో ఉన్న ఒక మహిళను కాపాడారు. ఆదివారం తాం దూర్ మండలం కోతలపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ గర్భవతితో కడుపులో తీవ్ర రక్తస్రావం కావడం తో పరిస్థితి విషమించింది. దీంతో విషయం తెలుసుకున్న డాక్టర్ సంపత్ కుమార్ ఆ మహిళకు ఓ నెగెటివ్ రక్తం దానం చేసి ఆ గర్భవతికి పునర్జన్మను ప్రసాదించడంతో కుటుంబీకులు ఆయ నకు ధన్యవాదాలు తెలిపారు. 165 సార్లు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన ఆయనను స్థాని కులు ఆపద్బాంధవుడుగా పిలుచుకుంటారు.

## భృంగి జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



B LAASYA - MPC 1st Year(467/470)



J DEEPIKA - MPC 2nd Year(992/1000)



SHIREEN - BPC 1st Year(426/440)



SADIYA ISMAIL - BPC 2nd Year(989/1000)



G ANVITHA - MPC 1st Year(467/470)

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలోని బృంగీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన సందర్భంగా బృంగీ కళాశాల కార్యదర్శి ఏ ప్రమీల అభినందించారు. కళాశాలకు చెందిన అన్విత, లాస్య, దీపిక, సిరీన్, సదియా ఇస్మాయిల్ ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల డైరెక్టర్ శివప్రసాద్ ప్రిన్సిపల్ మహేందర్ రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీనివాస పద్మావతి కాలేజ్ ముందంజ

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** పట్టణంలోని శ్రీ శ్రీనివాస పద్మావతి జూనియర్ కాలేజ్ ఇంటర్ ఫలితాల్లో ముందంజలో నిలిచింది. కొండూరు మేఘనా ఎంపీసీలో 468/470 మార్కులతో రాష్ట్రంలో 2వ ర్యాంక్, జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చింది. పీ. శ్రీ వాణి 464/470 మార్కులు సాధించగా, ఎం. హరీష్ కుమార్ 464/470 మార్కులతో జిల్లాలో 2వ ర్యాంక్, జి. సౌమ్య 463/470 మార్కులతో జిల్లాలో 3వ ర్యాంక్ సాధించారు. బీపీసీలో బి. మౌనిక



436/450 మార్కులతో జిల్లాలో 1వ ర్యాంక్ సాధించగా, వి. నిహారిక, బి. పావని ఇద్దరూ 434/440 మార్కులతో జిల్లాలో 2వ ర్యాంక్ సాధించారు. సీఈసీ 1వ సంవత్సరంలో జోహా అంజుమ్ 458/500 మార్కులతో కళాశాలలో 1వ ర్యాంక్ సాధించగా, వి. మనీశ్వర్ 443/500 మార్కులతో 2వ ర్యాంక్ సాధించాడు. కళాశాల విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు, అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ రావు, యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, నిరంతర పరీక్షల ద్వారా విద్యార్థులను ఉత్తమ ఫలితాల దిశగా తీర్చిదిద్దామని తెలిపారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది.

## ఇంటర్ లో మెరుగైన ఫలితాలు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చాటినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ 2025-2026 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 3,482 మంది పరీక్షలు రాయగా 2161 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 62.06 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మన జిల్లా 18వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 884 మంది పరీక్షలు రాయగా 612 మంది ఉత్తీర్ణత సాధించి 69.23%తో రాష్ట్రంలో నాలుగవ స్థానంలో నిలిచారన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో మొత్తం జనరల్ విద్యార్థులు 2994 మంది పరీక్షలు రాయగా, 2186 మంది ఉత్తీర్ణత సాధించి 73.01%తో రాష్ట్రంలో మన జిల్లా 14వ స్థానంలో నిలిచిందన్నారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 706 మంది పరీక్షలు రాయగా 532 మంది ఉత్తీర్ణత సాధించి 75.04%తో మన జిల్లా రాష్ట్రంలో 13వ స్థానంలో నిలవడం జరిగిందన్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు రావడంతో ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు, డిఐఈఓ హృదయ రాజ్, ఇంటర్ విద్య యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు, అధ్యాపకులు వచ్చే ఏడాది కూడా మంచి ఫలితాలు వచ్చేలా బోధన చేయాలన్నారు. ప్రణాళికతో ముందుకెళితే జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపవచ్చన్నారు. ఆ దిశగా ఇప్పటి నుంచే కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

## సత్తా చాటిన గీతాంజలి కళాశాల విద్యార్థులు





**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. పాస్ శాతంలో కూడా కళాశాల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను శ్రీ వైష్ణవి, ఎం. యమున ఎ. శాస్రిక 463 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను దివిజ, సోహత 436 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను ఎ. చంద్రలేఖ 491 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఫలితాల్లో కూడా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను నిఖిత 993 మార్కులు సాధించగా, ఎంపీసీ విభాగంలో సైదా మెహరీన్ 991 మార్కులు, సీఈసీ విభాగంలో పి. అనిల్ 943 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ సునేంద్ర, ప్రిన్సిపాల్ శ్రీ శరత్ బాబు, కరస్పాండెంట్స్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఉదయ్ కుమార్, అధ్యాపక బృందం శాలువాలతో సన్మానించి అభినందించారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో 58.8 శాతం ఉత్తీర్ణత



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో58.8 శాతం ఉత్తీర్ణులైనట్లు నోడల్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. జిల్లాలో మొత్తం 5,353 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 2,987 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. గత సంవత్సరం మొత్తం 4,500 మంది విద్యార్థులు హాజరుకాగా 2,982 మంది ఉత్తీర్ణులై 66.27 శాతం ఫలితాలు సాధించినట్లు అధికారులు తెలిపారు. బాయ్స్ విభాగంలో ఈ సంవత్సరం 1,872 మంది విద్యార్థులు హాజరుకాగా, 938 మంది ఉత్తీర్ణులై 50.37 శాతం ఫలితాలు నమోదయ్యాయి. గర్ల్స్ విభాగంలో 1536 మంది విద్యార్థులు హాజరై, 870 మంది ఉత్తీర్ణులై 56.64 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఈసారి ఫలితాలు గత సంవత్సరం పోలిస్తే ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయని ఆయన తెలిపారు.

## ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు






**ముద్ర, మల్కాజ్‌గిరి:** ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఇండియన్ ప్రీమియర్ లీగ్2026 మ్యాచ్‌లు ఏప్రిల్ 5, 13, 18, 21, మే 3, 6, 22 తేదీలలో జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డైవర్షన్లు అమలు చేస్తున్నారు. ఏప్రిల్ 13న సన్ రైజర్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నాగోల్–హబ్సిగూడ (ఉప్పల్ జంక్షన్) బోడుప్పల్–అంబర్‌పేట్ మార్గాల్లో మోస్తరు ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు వీలైనంతవరకు ఈ మార్గాలను నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలనీ సూచించారు.

**హెవీ వాహనాలకు పరిమితులు**

లారీలు, డంపర్లు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ప్రైవేట్ బస్సులు తదితర హెవీ వాహనాలను వివిధ మార్గాల్లో మళ్లించనున్నారు. ఘట్‌కేసర్, ఎల్‌బీనగర్, తార్నాక, రామంతాపూర్ వైపుల నుంచి వచ్చే వాహనాలకు ప్రత్యేక డైవర్షన్లు అమలు చేస్తారు. అలాగే వరంగల్–హైదరాబాద్ మార్గంలో ప్రయాణించే వాహనాలను ఓ ఆర్ ఆర్ మార్గం వైపు మళ్లించనున్నారు.

**ప్రజలకు సూచనలు**

ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రజలు టి ఎస్ ఆర్ టి సి, హైదరాబాద్ మెట్రో, బస్సులు సేవలను వినియోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

**పార్కింగ్ ఏర్పాట్లు**

ఏప్రిల్ 13 మ్యాచ్ సందర్భంగా మొత్తం 5 పార్కింగ్ ప్రదేశాలు గుర్తించారు. వీటిలో 4 స్టేడియం బయట సాధారణ ప్రేక్షకుల కోసం, ఒకటి స్టేడియం లోపల వీఐపీలకు కేటాయించారు. ఉప్పల్–హబ్సిగూడ, ఉప్పల్–రామంతాపూర్ మార్గాల్లో పెంగ్విన్ ప్రదేశం, మోడర్న్ బేకరీ వంటి ప్రదేశాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. స్టేడియం లోపల పార్కింగ్ మాత్రం అనుమతిపత్రం ఉన్న వాహనాలకు మాత్రమే పరిమితమైన మార్గాలు, తేదీలు, సమయాలను ముందుగానే గమనించి ప్రజలు తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణలో సహకరించాలని మల్కాజ్గిరి ట్రాఫిక్–II డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోరారు.

## వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్

### 240 మందిపై కేసులు
### సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి రంజివ్ రతన్ కుమార్

**ముద్ర, శేరిలింగంపల్లి:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి- I రంజన్ రతన్ కుమార్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 240 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 193 ద్విచక్ర వాహనదారులు, 9 ఆటోలు, 38 కార్లు, హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం



సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమన్నారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారంలో మొత్తం 86 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి.వీరిలో ఇద్దరికి జరిమానా, జైలు శిక్షతో పాటు ఒక్కరికి జరిమానా, సోషల్ సర్వీస్, 83 మందికి జరిమానా విధించబ



డినట్లు తెలిపారు.

### మల్కాజ్‌గిరిలో 286 మందిపై ..

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్‌లు వీకెండ్‌లో ప్రత్యేక డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించి మొత్తం 286 మందిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఎక్కువ మంది 251 మంది ద్విచక్ర వాహన దారులే కావడం గమనార్హం. వారందరినీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. గత వారం ఏప్రిల్ 5 నుంచి11 తేదీలో 218 కేసులు కోర్టుల్లో పరిష్కరించగా, 30 మందికి జైలు శిక్ష, ఇద్దరికి ఫైన్‌తో పాటు సామాజిక సేవ, 186 మందికి కేవలం జరిమానా విధించారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా హాస్పిటల్ ప్రారంభం



**ముద్ర, నాగర్‌కర్నూల్:** పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన న్యూరో సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం అదే వార్డులోని 9 జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన రుద్ర పాలీ క్లినిక్ హాస్పిటల్ ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు నిజాం, అనంత అలివేలమ్మ, రాజేశ్వరి, శంకర్, పద్మమ్మ, ఆసిఫా బేగం ఖాదర్, డీసీసీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపతి గౌడ్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హరీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


## సీఎం కు ఘన స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ





**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఒక పెళ్లికి హాజరయ్యే నిమిత్తం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌలతాబాద్ మండలానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, తాండూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, తాండూర్ ఆర్డీవో కే. అనిత ఇతర అధికారులు పలువురు ప్రజా ప్రతినిధులు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఆదివారం పలు వివాహ వేడుకల్లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్స్ లో రాఘవపూర్ వాస్తవ్యులు వడ్డే జగదీష్ వివాహం, వెంకోబ గార్డెన్ లో కొర్విచేడ్ వాస్తవ్యులు పాండురంగా రెడ్డి కుమారుని వివాహం, వినాయక కన్వెన్షన్ లో మాజీ ఏఎంసి చైర్మన్ రాము నాయక్ కుమార్తె వివాహం, గగ్రాని కళ్యాణమంటపంలో గొట్టిక కలాన్ వాస్తవ్యులు సుధాకర్ గౌడ్ వివాహం, కింగ్ ప్యాలస్ లో దేవనూర్ వాస్తవ్యులు రమాదేవి వివాహం, క్లాసిక్ గార్డెన్స్ లో రెడ్డి ఘనపూర్ వాస్తవ్యులు తలారి వెంకటప్ప కూతురి వివాహం, సల్ల గార్డెన్స్ లో జినుగుర్తి వాస్తవ్యులు మోహన్ రెడ్డి కుమారుడి వివాహం, మినీ భూకైలాస్ లో వీరమని కూతురి వివాహం, భవాని ఫంక్షన్ హాల్ లో రాంపూర్ తండా వాస్తవ్యులు గణేష్ వివాహం, మిట్టబాస్పల్లి వాస్తవ్యులు శ్రీశైలం వివాహ వేడుకలో పాలొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు ప్రభాకర్ గౌడ్, మురళి గౌడ్, సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మాంసంతో లాభాలు : జింక్ అందిస్తుంది
రోగనిరోధక శక్తిని పెంచడంలో జింక్ కీలకం. గాయాలు త్వరగా మానడానికి సహాయపడుతుంది.

# ఇంటర్ ఫలితాల్లో 12 వ ర్యాంక్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



ఇంటర్ పరీక్ష ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరినట్లు కలెక్టర్ అభిలాష తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో నిర్మల్ జిల్లా 62.93 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 12 వ ర్యాంక్, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 73.43 శాతం ఉత్తీర్ణతో 13 వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా కృషిచేసిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.


# అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

- **ఎస్పీ అశోక్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**




అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా బోధన్ లో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ జనాభా లెక్కలు నిర్వహిస్తున్నామని చెప్పి ఇళ్లకు వెళ్లి చోరీ చేసినట్లు తెలిపారు. నిజమైన ప్రభుత్వ సిబ్బంది ఎప్పుడూ గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు కలిగి ఉంటారన్నారు. వాటిని చూపించకుండా ఎవరినీ ఇంట్లోకి అనుమతించకూడదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం జనాభా లెక్కలు లేదా ఇలాంటి ఇంటింటికి వెళ్లే అధికారిక కార్యక్రమాన్ని ప్రారంభించలేదని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలన్నారు. మోసపూరిత చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



# వైభవంగా శ్రీనివాస కల్యాణం

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

పట్టణలోని శ్రీనివాస ఆంజనేయ, భవాని శంకర దేవాలయంలో ఆదివారం శ్రీనివాస కల్యాణాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు
ఉదయం ఆలయంలోని స్వామి, అమ్మవార్ల కు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం పురస్కరించుకొని ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీనివాసుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. అనంతరం భక్తులకు స్వామి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బాశెట్టి లవకుమార్, ఈవో సంగెమ్ సురేందర్, ఆలయ అర్చకులు మేడిపల్లి రాజన్న శర్మ, రుద్రాంగి గోపాలకృష్ణ శర్మ, రుద్రంగి శశాంక్ మౌళి శర్మ, కొండపల్లి సూరజ్ శర్మ, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, మంచాల రాంగోపాల్, గౌరిశెట్టి రాజు, గౌరిశెట్టి గణేష్, గౌరిశెట్టి సాధన, రాగి వెంకటేశం, వొల్లాల సత్తయ్య, అనుమల్ల ఉమాభారతి, బంగ్లా శేఖర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.




# ఎస్ఆర్ బాలికల విజయకేతనం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

ఇంటర్ ఫలితాల్లో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ఆర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగురవేశారు. బైపీసీ మొదటి సంవత్సరంలో
ఇ. ఆరాధ్య 438 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. సఫా మహీన్ 437, జి.ఆలేఖ్య 436, అయేషా రిధ 434, నవ్య 432 మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో రహీన్ 465 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు. ఎస్.హర్షిణి 464, ఎస్.సంజన 461, శ్రీవన్య 461, రక్షిత 460 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో డి.శ్రీనిధి 993, అయేషా 990, శ్రీజ 990, శిరీష 990, శృతిక 989, లక్ష్మి ప్రసన్న 989 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో బి. శ్రీలక్ష్మి 993, డి.గౌరి 992, కె.అఖిల 990, ఎం.శ్రీజ 989 మార్కులు సాధించారు. విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జోనల్ ఇంచార్జి నగేష్ యాదవ్, డీన్ రాంబాబు, ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

# తాగునీరువ్వని అసమర్థ నేత కొప్పుల

- **మాజీ మంత్రిపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు**

**ముద్ర, ధర్మపురి:**



ధర్మపురికి తలాపున గోదావరి ఉన్నా పట్టణ ప్రజలకు తాగునీరు అందించలేని అసమర్థ నేతగా కొప్పుల ఈశ్వర్ పేరు తెచ్చుకున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఓ ఛానల్ ఇంటర్వ్యూలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై చేసిన ఆరోపణపై ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, గొల్లపల్లి, వెల్గటూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నిశాంత్ రెడ్డి, శైలేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపణలు అర్థం లేనివని ఖండించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని కొప్పుల ఈశ్వర్ అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన పదేళ్ల పాటు ఏలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేశారో ప్రజలకు తెలుసన్నారు. వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాల మూతపడిన కొప్పుల ఈశ్వర్ పట్టించుకోలేదని విమర్శించారు. 2023లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆరు నెలల్లోపు లక్ష్మణ్ కుమార్ కళాశాల పునరుద్ధరణకు కృషి చేశారని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఇటీవల అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపనలు చేశారని తెలిపారు. ఇప్పటికే రూ. 15 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపట్టిన అమృత్ పథకంలో రూ. 22 కోట్లతో ధర్మపురిలో మంచినీటి ట్యాంక్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ప్రజల నీటి అవసరాలు తీర్చడానికి రూ. 2 కోట్లతో బోర్ వెల్స్ తవ్వించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా రూ. 25 లక్షలతో పనులు చేపట్టామని పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలో డిగ్రీ కళాశాల సైతం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి రూ. 4.60 కోట్లతో 11 కేవీ లైన్ సమస్యకు మంత్రి పరిష్కారం చూపించారన్నారు. ప్రతి కుల సంఘానికి భవనాలు ఉండాలని రూ. రెండు కోట్లు నిధులు కేటాయించారన్నారు. ధర్మపురి పట్టణ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. పవిత్ర గోదావరి నది కలుషితం కాకుండా సీవరేజ్ ప్లాంట్ నిర్మాణానికి రూ.7 కోట్లు కేటాయించారని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా 3500 ఇళ్లు నిర్మించారన్నారు. ధర్మపురి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేయడంలో కొప్పుల ఈశ్వర్ విఫలం కావడంతోనే మార్పు కోరిన నియోజకవర్గ ప్రజలు 2023లో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను గెలిపించారన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలే మంత్రి అడ్లూరి పనితీరుకు నిదర్శనమన్నారు. 70 శాతం స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ధర్మపురిలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసుకుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభివృద్ధి కార్యక్రమాలతో బీఆర్ఎస్ ధర్మపురిలో ఉనికి కోల్పోతుందన్నారు. నియోజకవర్గంలో కొప్పుల ఈశ్వర్ పదేళ్ల పరిపాలన, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రెండేళ్ల పరిపాలనపై చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాగారం సర్పంచ్ చిలుముల లక్ష్మణ్, కాంగ్రెస్ ధర్మపురి మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపురిశెట్టి రాజేష్, వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, సుముఖ్ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రవేత్తగా రాణిస్తున్న రైతు బిడ్డ

**బోథ్, ముద్ర:**

మారుముల ప్రాంతానికి చెందిన రైతు బిడ్డ వ్యవసాయ శాస్త్రవేత్తగా రాణిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌట బి గ్రామానికి చెందిన డాక్టర్ లంకటి మహేష్ కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే) లో వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. శాస్త్రవేత్త గా ఆయన దేశ వ్యాప్తంగా వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. రైతులు, గ్రామీణ యువత, విస్తరణ కార్మికులకు కేవీకేలో వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన పలు అంశాలపై రైతులకు 42 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. 1,718 మంది ట్రైనీలకు నైపుణ్య శిక్షణ. వృత్తి శిక్షణా కార్యక్రమాలు చేపట్టారు. చాలా మంది డీలర్లకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ మహేష్ లంకటి ఇప్పటివరకు వ్యవసాయ రంగానికి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ లో 22 వేర్వేరు పరిశోధనా పత్రాలు, 13 పుస్తక అధ్యాయాలను ప్రచురించారు. ఆయన అనేక జాతీయ. అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో ఆయన చేస్తున్న కృషికి గాను వివిధ విభాగాల్లో నాలుగు అవార్డులు స్వీకరించారు. 2024 లో ఆయన రైతులకు చేసిన సేవలకు గాను ఉత్తమ కేవీకే శాస్త్రవేత్త అవార్డును ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా స్వీకరించారు. 2024 లో ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ (ఐఎస్ఏఎస్టీఆర్) నోయిడాలో జరిగిన కాన్ఫరెన్స్ లో ఆయన చేసిన పరిశోధనలకు గాను ఉత్తమ వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త అవార్డు స్వీకరించారు. 2025 లో హన్రాజ్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నిర్వహించిన రెండో అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ నవీన శాస్త్రవేత్త అవార్డు స్వీకరించారు. 2026 లో మధ్యప్రదేశ్ లో నిర్వహించిన ఒకటో అంతర్జాతీయ సదస్సు నందు ఉత్తమ కేవీకే శాస్త్రవేత్త అవార్డు స్వీకరించారు. డాక్టర్ మహేష్ గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధిని సాధించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు.


మంత్రి శ్రీధర్ బాబు నుంచి అవార్డు తీసుకున్న మహేష్(ఫైల్)

# శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

**ముద్ర, మంచిర్యాల:**



పోలీసు శాఖ శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి నూతన పోలీస్ స్టేషన్‌ను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి ప్రారంభించారు. భీమిని మండల నుంచి నూతనంగా ఏర్పడిన కన్నెపల్లి మండలంలో రూ. 2 కోట్ల వ్యయంతో నూతన పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎవరూ విఘాతం కలిగించకూడదని స్పష్టం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ కుమార్ దీపక్, సబ్ కలెక్టర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పుస్తకాల పంపిణీ

**ముద్ర, మంచిర్యాల:**



మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో ఆదివారం కానిస్టేబుల్ దిలీప్ ఆధ్వర్యంలో వాకర్ అసోసియేషన్ సభ్యులకు రాజ్యాంగ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు.
అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని హక్కులు ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంతేకాకుండా సమాజం కోసం తన జీవితాన్ని ధారబోసిన అంబేద్కర్ గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొతుకు సుదర్శన్, ప్రభాకర్, పోలు శ్రీనివాస్, మద్ది శంకర్, ముల్కల రాజేంద్రప్రసాద్, రాము, గురుప్రసాద్, తుంగపిండి శంకర్ పాల్గొన్నారు.

# ఇంటర్ లో మెరుగైన ఫలితాలు

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల జిల్లాలో గతంలో కంటే ఈ ఏడాది ఇంటర్ లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో గతేడాది 56.34%తో 24వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం 62.81% తో 13వ స్థానంలో నిలిచింది. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గతేడాది 68.73%తో 18వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం 74.9% తో 10వ స్థానంలో నిలిచింది. మెరుగైన ఫలితాల కోసం కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 6,645 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,1 74 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 62.81 శాతం ఉత్తీర్ణతో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 5,792 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,338 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 74.9 శాతం ఉత్తీర్ణతో రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫస్టియర్ ఒకేషనల్ కోర్సులో 1,055 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 631 మంది విద్యార్థులు పాసై, 59.81 శాతంతో రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సులో 833 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 602 మంది విద్యార్థులు పాసై 72.27 శాతంతో 21వ స్థానంలో నిలిచింది.

# ఇంటర్ టాపర్ కు సన్మానం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

ఇంటర్ టాపర్ అక్షరను ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి సన్మానించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో స్థానిక అల్ఫోర్స్ కాలేజీ విద్యార్థి అక్షర 469 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. పట్టణంలోని గాజుల పేట్ కు చెందిన గౌడ్ కిషన్ సింగ్ సవిత ల కుమార్తె అక్షర ఉత్తమ ప్రతిభ కనబరచడంపై మున్సిపల్ వైస్ చైర్మన్ అభినందించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మాంసంతో లాభాలు

ఎనర్జీ స్థాయిలు పెరుగుతాయి. మాంసంలో ఉన్న పోషకాలు శక్తిని అందిస్తాయి. శారీరక శ్రమ చేసే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది.



# స్వర్ణగిరి ప్రదక్షిణ





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం అయిన శ్రావణ నక్షత్రం పురస్కరించుకొని ఆదివారం ఉదయం స్వర్ణగిరి క్షేత్రంలో భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా కొండ కింద ఉన్న శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం గోవింద నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచి నీరు మజ్జిగ అందించి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలో అర్చక స్వాములుసు ప్రభాత సేవతో మొదలుకొని నిత్య కైంకర్యాలు చేశారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించి స్వామివారి రథోత్సవ సేవ ఆది మధ్యాంతరహితుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో రథం పై శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామ స్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారికి రథోత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.



## ఇంటర్ ఫలితాల్లో 'శ్రీ వైష్ణవి' విజయ భేరి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**
ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలను భువనగిరి పట్టణంలోని శ్రీ వైష్ణవి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా లోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించి విజయ భేరి మోగించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో గాజుల అభిరామ్ 991/1000, పి భవ్య శ్రీ 988, సాయి కృష్ణ 980, జి.కరుణాకర్ 980, బీపీసీ విభాగంలో వి.అను 990/1000, ఎం.శిరీష 986, సదాఫ్ 981, ఎమ్.లిఖిత 977, డి.హర్షిత 972, సీఈసీ విభాగంలో గొర్రు కీర్తన 964/1000, శివాని 963/1000, ఫరీనా 956, మొదటి సంవత్సర ఎంపీసీ విభాగంలో జాయ్ ఇవాంజిఎల్ 466/470, వి హర్షిత 465, ఎస్ అపూర్వ 465. కే వైష్ణవి 463, బైపిసి విభాగంలో వి తేజశ్రీ 436 /440, డి కారుణ్య 436, బి శ్రీ వర్షిని 434/440 డి సాయి సహస్ర 432, సిహెచ్ మాలిక 430, సిఈసి విభాగంలో సానియా ఫాతిమా 488/500, కైరం కొండ అమూల్య 478, షేక్ అబ్దుల్ కలాం 477, ఏంఈ సి విభాగంలో కే.అక్షర 486/500, జి లహరి 471 జిల్లా లోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మదిర మల్లేశం మాట్లాడుతూ విజయాలకు సహకరించిన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల వద్ద బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.



## ఉచిత వైద్య శిబిరం

**ముద్ర, యాదగిరిగుట్ట :**
యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లిలో కంబాల జహంగీర్, పాండు, కృష్ణ యాదవ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నీలిమ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్, కౌన్సిలర్లు పేరబోయిన సత్యానారాయణ యాదవ్, ముక్కర్ల మల్లేష్ యాదవ్, బబ్బురి శ్రీధర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్లు రోగులకు ఉచితంగా వైద్య పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ నెంబర్ పేరబోయిన పెంటయ్య, ముక్కెర్ల అండలు, పేరబోయిన మహేందర్, కంబాల సాయి తేజ్,పబ్బల నరసింహ, కంబాల సాయి కుమార్, బండి అనిల్ పాల్గొన్నారు.

## 72.99 శాతం ఉత్తీర్ణతతో 16వ స్థానంలో యాదాద్రి జిల్లా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సర పరీక్ష ఫలితాలలో యాదాద్రి భువనగిరి జిల్లా జనరల్ రెగ్యులర్ రెండవ సంవత్సర విద్యార్థులు 4457 (2119 బాలురు 2338 బాలికలు) హాజరు అవ్వగా 3253 (1395 బాలురు 1858 బాలికలు) ఉత్తీర్ణత చెంది 72.99 % తో రాష్ట్రంలో 16 వ స్థానంలో నిలిచినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి తెలిపారు.
ఒకేషనల్ 2వ సంవత్సంలో 1324 (64 బాలురు 684 బాలికలు ) విద్యార్థులకు గాను 915 (375 బాలురు 540 బాలికలు మంది ఉత్తీర్ణత తో 69.11 % శాతంతో 25 వ స్థానం పొందినది. అలాగే జనరల్ మొదటి సంవత్సర పలితాలలో 5178 (2580 బాలురు 2598 బాలికలు )మంది విద్యార్థులు హాజరు అవ్వగా 3124( 1382 బాలురు 1742 బాలికలు) విద్యార్థులు ఉత్తీర్ణత చెంది 60.33% శాతముతో 20 వ స్తానము పొందగా మొదటి సంవత్సర ఒకేషనల్లో 1373( 727 బాలురు 646 బాలికలు విద్యార్థులకు గాను 681( 256 బాలురు 425 బాలికలు) మంది ఉత్తీర్ణయత చెంది 49.60 % శాతముతో మంచి పలితాలు సాదించామని ఆమె అన్నారు. మంచి ఫలితాలు సాదించడానికి కృషి చేసిన జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ జూనియర్ లెక్చరర్ లను అభినందించారు.

# తెలియని వెబ్‌సైట్లతో జాగ్రత్త

- మోసాలు జరిగే అవకాశం ఎక్కువ
- హెల్ప్ లైన్ 1930 కి సంప్రదించాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

**ముద్ర, సూర్యాపేట**
ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ప్రజలకు సూచనలు చేశారు. ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,



ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధం గా వాట్సాప్ నందు టెలిగ్రామ్ సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు. జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.



## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

**ముద్ర, బీబీనగర్ :**
మండలం ముగ్ధంపల్లి గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం ఎస్సీ కాలనీ మెయిన్ రోడ్డు నుండి పోచమ్మ గుడి వరకు గ్రామ సర్పంచ్ శిగ నరేష్ గౌడ్ సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శెట్టి సోనీ మల్లేష్, ఎంజాల వెంకటేష్, మట్ట గోపి, శేఖర్ రెడ్డి, ప్రసన్న, గోరుగంటి శంకర్, బాలకృష్ణ, పాదం రాధిక, సురేష్ పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కోసం పోరాటాం

**ముద్ర, ఖమ్మం:** నాడు తెలంగాణ కోసం నేడు తెలంగాణ ఉద్యమకారుల కోసం పోరాటం చేస్తామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీలం పాపారావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ పాలకుర్తి కృష్ణ, మీడియా కన్వీనర్ మంద వెంకటేశ్వర్లు, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్ర చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి


- ఆలేరు ప్రెస్ క్లబ్ డిమాండ్

**ముద్ర, ఆలేరు :** జర్నలిస్టులందరికీ ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులను అందించాలని ఆలేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహ మ్మద్ కుర్షిద్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఆలే రులో జరిగిన ప్రెస్ క్లబ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న, పెద్ద పత్రికలు అని చూడకుండా, జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ కార్డులను ప్రభుత్వం అందించేలా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కోరుటూరు ఉపేందర్, సీనియర్ జర్నలిస్టులు ఎర్ర జాన్సన్, తోట మల్లయ్య, గుండు మహేందర్, ఎలగల కుమారస్వామి, దూడల సాగర్ వంగరి శివకుమార్,సిరిగిరి స్వామి సీస సాయిరాం, సందేన శంకర్ గుండు మధు,మంచన మల్లేశం బోడ నరేష్, కూళ్ళ సిద్ధులు, శ్రీనివాస్ ఉన్నారు.

## భీమ్ యాత్రను విజయవంతం చేయాలి

- దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
ఏప్రిల్ 14 న అంబేద్కర్ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలో నిర్వహించబోయే భీమ్ యాత్రను విజయవంతం చేయాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ లు పిలుపునిచ్చారు. ఆదివారం అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 14న ఉదయం 8 గంటలకు హైదరాబాద్ చౌరస్తా నుండి ప్రారంభమయ్యే భీమ్ యాత్రకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు ప్రజాస్వామ్యక వాదులు, ప్రజాసంఘాల నాయకులు, అంబేద్కర్ వాదులు, అంబేద్కర్ రిస్టులు అందరూ వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కర్తల శ్రీనివాస్, ఎండీ. సజావుద్దీన్, కుతడి సురేష్, ఇటుకల దేవేందర్, నాగరం



శంకర్,బొట్ల రమేష్, కాశపక మహేష్, చింతల శివ ,గాయపక శ్రవణ్ పాల్గొన్నారు.



## రైతు సంఘం ఆవిర్భావ వార్షికోత్సవాలు

**ముద్ర, చిట్యాల :** అఖిల భారత కిసాన్ సభ (అఖిల భారత రైతు సంఘం) 90వ వార్షికోత్సవాల సందర్భంగా చిట్యాల మండలం చిన్నకాపర్తి, ఉరుమడ్ల, వెలిమినేడు గ్రామాల్లో ఆదివారం ఘనంగా జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహా, జిల్లా కమిటీ సభ్యులు అరూరి శ్రీను లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ నెల 14న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్ లో రైతు సంఘం జిల్లా మహాసభలు, ఈ నెల 23,24,25 వ తేదీ లలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జెండాలను వెలిమినేడు లో అరూరి శ్రీను, ఉరుమడ్ల లో ఐతరాజు నర్సింహా, చిన్న కాపర్తిలో రూపని ఇద్దయ్యలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి,అవిశెట్టి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి దాని స్థానంలో మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే ప్రయత్నాన్ని అడ్డుకుందామని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన "భారత రాజ్యాంగం పరిరక్షణ – సవాళ్ళ" పై సెమినార్ లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలను తుంగలో తొక్కి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పెద్దలు రాజ్యాంగంలో ఉన్న లౌకిక, సోషలిస్ట్, సామ్యవాద పదాలు ఉచ్చరించేందుకు జంకుతున్నారని అన్నారు. రాజ్యాంగం అందించిన ఫలాలను అట్టడుగు ప్రజలకు అందకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల రిజర్వేషన్లు కనుమరుగు చేస్తున్నారని అన్నారు. విద్యా, వైద్యం నుండి పేదలను దూరం నెట్టేస్తున్నారని తెలిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు భిన్నంగా మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు అన్ని ప్రభుత్వ విభాగాలలో ఆర్ఎస్ఎస్ వ్యక్తులతో నియామకాలు చేపడుతున్నదని అన్నారు. దేశాన్ని పురోగమనం వైపు కాకుండా తిరోగమనం వైపు తీసుకెళ్తుందని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుండే సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం రద్దుచేసి బాగా డబ్బున్న కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని అన్నారు. ఈ లేబర్ కోడ్స్ యూనియన్లు పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, రాయబారాలు, సంప్రదింపులు లేకుండా చేసి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. పని గంటలు పెంచడంతో పాటు కనీస వేతనాలపై జవాబుదారితనం




లేకుండా వదిలేసే పరిస్థితులు రానున్నాయని మొత్తంగా కార్మికులను శ్రమదోపిడి చేసి బానిసలుగా మార్చేందుకు కుట్రలు చేస్తుందని అన్నారు. పౌర సంబంధమైన క్రిమినల్ చట్టాలను రద్దుచేసి కొత్త చట్టాలను తీసుకొచ్చి పాలకవర్గాలకు, డబ్బున్న వారికి ఉపయోగపడే విధంగా ప్రజలకు వ్యతిరేకమైనవిగా తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ రంగంలో రైతులను తమ భూముల నుండి తామంతట తామే వెళ్లిపోయేందుకు వ్యవసాయ చట్టాలను తెచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, పట్టణ కన్వీనర్ గంధముల మాతయ్య, నాయకులు ఊదరి రామచందర్, ఆడెపు వెంకటేష్ ఇటికల బిక్షపతి బాల నరసింహ సల్ల రాజయ్య బట్టు కొండయ్య రాజలింగం వరమ్మ శాంతమ్మ సత్యమ్మ సుజాత సునీత కుమారి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మాంసంతో నష్టాలు : హృదయ సంబంధిత సమస్యలు పెరుగవచ్చు**

అధికంగా మాంసం తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఇది గుండె జబ్బులకు కారణమవుతుంది.





## నర్సింగ్ కళాశాల సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లా కేంద్రం పిల్లి కొట్టాల్ శివారులో గల నర్సింగ్ కళాశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ ఆదివారం సందర్శించారు. కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రోహిత్ రావు ఆదేశించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సూచనతోనే కళాశాలను సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థినీలు ఎదుర్కొంటున్న సమస్యలను విని నివేదిక సిద్ధం చేశారు. నర్సింగ్ కళాశాల ఆవరణలో ఉన్న అపరిశుభ్ర వాతావరణం, వంట గదిలో ఉన్న సామాగ్రి నిల్వలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో నెలకొన్న పరిస్థితిని ఎమ్మెల్యే రోహిత్ రావుకు ఫోన్ ద్వారా తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. విద్యార్థినీలను ఇబ్బందులకు గురిచేస్తూ అపరిశుభ్ర వాతావరణంలో, కుళ్లిన పదార్థాలతో వంటలు చేసి భోజనం పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంట కాంగ్రెస్ నాయకులు కానుగు భూపతిరాజ్, నర్సింగ్ కళాశాల సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులకు తక్షణం మౌలిక వసతులు కల్పించాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలను మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. 120 మంది విద్యార్థులకు ఒకే టాయిలెట్ ఉండటం దురదృష్టకరమని అన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి అదనపు మెస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను బెదిరించడం, భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హెచ్చరించారు. వారం రోజుల్లోనే కళాశాలలో అన్ని మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రభుత్వం, అధికారులకు గడువు విధించారు. లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం వాటిలో సరైన సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. విద్యార్థులు మంచి శిక్షణ పొందితే భవిష్యత్తులో సమాజానికి మెరుగైన సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఆమె వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, కౌన్సిలర్లు బట్టి ఉదయ్, దీపక్ కుమార్, నాయకులు లింగారెడ్డి, సురేందర్ గౌడ్, కిష్టగౌడ్, మాయ మల్లేశం, ఆర్కే శ్రీనివాస్, సంతోష్, సాయి కుమార్, నవీన్, బాలరాజు, కిరణ్, స్వామి నాయక్ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేటలో గంగాజమునా తహజీబ్ కొనసాగుతోంది

- తంజీమ్ సుప్రీం బాడీ సభ్యులు అబ్దుల్ ఖాదర్




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేటలో హిందూముస్లింల ఐక్యతతో ఎల్లప్పుడూ గంగాజమునా తహజీబ్ కొనసాగుతుందని సిద్దిపేట తంజీమ్ సుప్రీం బాడీ సభ్యులు, సిద్దిపేట హజ్ సొసైటీ అధ్యక్షుడు మంజూర్ తెలిపారు. ముస్లిం సోదరులు జరుపుకునే రంజాన్, బక్రీద్ పండుగల సమయంలో సిద్దిపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ సురేందర్ రెడ్డి త్రాగునీటిని ఏర్పాటు చేస్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన హజ్ సొసైటీ ఆదివారం సిద్దిపేట హజ్ హౌస్‌లో ఆయనను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా సిద్దిపేటలో సేవలు చేయడం అభినందనీయమని అన్నారు. అందరూ కలిసితేనే దేశ అభివృద్ధితో పాటు శాంతి సమాజం నెలకొల్పవచ్చని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి సన్మానించినందుకు సురేందర్ రెడ్డి హజ్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హజ్ సొసైటీ సభ్యులు కాలిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్ ఫలితాలు**

# ఒకేషనల్‌లో టాప్.. జనరల్‌లో నిరాశ

- ఉత్తీర్ణతలో బాలికల దూకుడు.. జిల్లాకు మిశ్రమ ఫలితాలు



కావ్య శ్రీ 991/1000, బీపీసీ మైనారిటీ కళాశాల మెదక్



అక్షయ 990/1000 , ఎంపీసీ మైనారిటీ కళాశాల మెదక్



ఎన్. శృతిక, ఎంపీసీ -1 467/470, స్టేట్ సెకండ్ ర్యాంక్



జి.శ్రీలత 975/1000 బీపీసీ, కేజీబీవీ మెదక్



మన్నే శ్రావణి , ఎంపీసీ 992/1000, టిఎస్ఆర్జెసి -మెదక్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ఇంటర్ ఫలితాల్లో మెదక్ జిల్లా ఆశించిన ఫలితాలు సాధించలేదు. ద్వితీయ సంవత్సరంలో 26వ స్థానం, ప్రథమ సంవత్సరంలో 28వ స్థానంలో జిల్లా నిలిచింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయిగా నిలిచింది. జిల్లాలోని మూడు గురుకుల కళాశాలలు శాతం శాతం ఉత్తీర్ణత సాధించాయి. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 4,826 మంది పరీక్షలు రాయగా 3,310 మంది (68.59 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 1,983 మంది పరీక్షలు రాయగా 1,168 మంది (58.90 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 2,843 మంది హాజరు కాగా 2,142 మంది (75.34 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో బాలుర ఉత్తీర్ణత 46.99 శాతం మాత్రమే ఉండగా, బాలికలు 61.54 శాతంతో ముందంజలో నిలిచారు. మొత్తం 3,250 మంది బాలికలు పరీక్షలు రాయగా 2,000 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 2,460 మందిలో 1,256 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

**ఒకేషనల్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం..**

ఒకేషనల్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో మెదక్ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం 599 మంది పరీక్షలకు హాజరుకాగా 440 మంది (73.46 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 289 మంది పరీక్షలు రాయగా 171 మంది (59.17 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 310 మంది పరీక్షలు రాయగా 260 మంది (86.77 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో మెదక్ జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. 539 మంది పరీక్షలకు హాజరుకాగా 460 మంది (85.34 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలురు 250 మంది పరీక్షలు రాయగా 192 మంది (76.80 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 289 మంది పరీక్షలు రాయగా 268 మంది (92.73 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

**కేజీబీవీ విద్యార్థికి 975 మార్కులు..**

మెదక్ కేజీబీవీలో జీవశాస్త్ర విభాగానికి చెందిన జి. శ్రీలత 975 మార్కులు సాధించింది. జీవశాస్త్ర ద్వితీయ సంవత్సరంలో 37 మంది పరీక్షలు రాయగా 26 మంది ఉత్తీర్ణులయ్యారు. 11 మంది అనుత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 32 మంది పరీక్షలు రాయగా 17 మంది ఉత్తీర్ణులయ్యారు. 15 మంది అనుత్తీర్ణులయ్యారు. గణితశాస్త్ర ద్వితీయ సంవత్సరంలో 10 మంది పరీక్షలు రాయగా 8 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇద్దరు అనుత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 30 మంది పరీక్షలు రాయగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు. 11 మంది అనుత్తీర్ణులయ్యారని ప్రత్యేకాధికారి కవిత తెలిపారు.

**మైనారిటీ కళాశాల విద్యార్థుల ప్రతిభ..**

ఇంటర్ ఫలితాల్లో మెదక్ మైనారిటీ బాలికల కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. జీవశాస్త్ర ప్రథమ సంవత్సరంలో హారిక 438/440 మార్కులతో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించింది. గణితశాస్త్ర ప్రథమ సంవత్సరంలో శృతిక, అఫ్షా బేగం ఇద్దరూ 467/470 మార్కులతో రాష్ట్ర ద్వితీయ ర్యాంకు సాధించారు. జీవశాస్త్ర ప్రథమ సంవత్సరంలో శ్రావణి 436/440 మార్కులతో రాష్ట్ర తృతీయ ర్యాంకు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో గణితశాస్త్ర విభాగానికి చెందిన అక్షయ 990/1000 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, జీవశాస్త్ర విభాగానికి చెందిన కావ్యశ్రీ 991/1000 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ప్రథమ సంవత్సరంలో గణితశాస్త్ర విభాగంలో 400కు పైగా మార్కులు 12 మంది, జీవశాస్త్ర విభాగంలో 14 మంది విద్యార్థినీలు సాధించారని కళాశాల ప్రధానోపాధ్యాయురాలు సురేఖ తెలిపారు. మొత్తం కళాశాల ఉత్తీర్ణత 95 శాతంగా నమోదైంది. విద్యార్థులను, తల్లిదండ్రులను కళాశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. సురేఖ, సిబ్బంది అభినందించారు.

**ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని మంగళపర్తిలో విషాదం చోటుచేసుకుంది. ఇంటర్మీడియట్ ఫలితాల్లో అనుత్తీర్ణుడవడంతో మనస్తాపానికి గురైన చాకలి సాయిరాం అనే విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపిస్తున్నారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు.

# మేక్ ఇన్ తెలంగాణ మా లక్ష్యం

- పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు
- డిసెంబర్‌లోపు ప్రాజెక్టు పూర్తి
- యువతకు ఉపాధి కల్పన లక్ష్యం





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 20 ఎకరాల్లో రూ.210 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిశ్రమలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నర్మేట ప్రాంతంలోని వనరులపై పలు సార్లు చర్చలు జరిపి ఈ పరిశ్రమకు రూపకల్పన చేశామని తెలిపారు. బయో ఇంధనాల ప్రాముఖ్యత పెరుగుతోందని, గడ్డి వంటి వనరులతో ఇంధనం తయారు చేయవచ్చని వివరించారు. పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి లభించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కాలుష్యం లేని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రస్తుతం దేశం సుమారు 90 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, అందులో 65 శాతం వంటగ్యాస్ ఇతర దేశాలపై ఆధారపడుతోందని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాల ప్రభావంతో ఎల్పీజీ సరఫరాపై ప్రభావం పడుతోందని సూచించారు. "మేక్ ఇన్ ఇండియా" తరహాలో "మేక్ ఇన్ తెలంగాణ" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. నర్మేటలో ఏర్పాటు చేస్తున్న కర్మాగారంలో డిసెంబర్‌లోపు ఉత్పత్తి ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. భేషజాలాలు లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనేది ముఖ్యమంత్రిగారి సంకల్పమని పేర్కొన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుతో పరిశ్రమలకు ఊతం : హరీశ్ రావు**

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. ఇలాంటి పరిశ్రమ సిద్దిపేటకు రావడం ఆనందకరమన్నారు. పరిశ్రమల అభివృద్ధి కోసం ఇప్పటికే 201415 సంవత్సరాల్లో భూ సేకరణ చేపట్టామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, నీటి లభ్యత పెరగడంతో పరిశ్రమల స్థాపనకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వంటి పరిశ్రమలను ప్రారంభించామని, మరిన్ని పరిశ్రమలు రావడానికి ఇదే కారణమని తెలిపారు. గతంలో నీటి కొరత కారణంగా వరి పంటలు పండించలేకపోయేవారని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. రైతులకు ధాన్యంతో పాటు గడ్డి ద్వారా కూడా ఆదాయం వస్తోందని చెప్పారు. బయోగ్యాస్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా సుమారు 500 మందికి ఉపాధి లభిస్తుందని, రైతులకు కూడా అదనపు ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయని వెల్లడించారు. ప్రజలందరూ సహకరించాలని, రాజకీయాలకు అతీతంగా మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ప్రజలు సహకరిస్తేనే పరిశ్రమలు వస్తాయని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులపై స్పందిస్తూ, అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం భారత్ సుమారు 50 శాతం వాయువును దిగుమతి చేసుకుంటోందని, యుద్ధ పరిస్థితుల వల్ల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి బయోగ్యాస్ ప్లాంట్ల వల్ల ఆ సమస్యలను తగ్గించుకోవచ్చని, దిగుమతులను తగ్గించి స్వయం సమృద్ధి సాధించవచ్చని తెలిపారు.

## అక్రమంగా గోవుల తరలింపు.. అడ్డుకున్న పోలీసులు

**ముద్ర న్యూస్ :**

లింగంపేట మండలం నుంచి సంగారెడ్డి జిల్లాకు అక్రమంగా గోవులను తరలిస్తున్న ఓ వాహనాన్ని నాగిరెడ్డిపేట పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం తాండూరు గ్రామంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో గోవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపారు. వాహనంలో ఉన్న 10 గోవులను మెదక్ జిల్లాలోని హవేలీ ఘన్‌పూర్ మండలంలోని గోశాలకు తరలించినట్లు చెప్పారు. వాహనం యజమాని అబ్దుల్ రహ్మాన్, డ్రైవర్ సాయిలుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## కళాశాల స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

**ముద్ర న్యూస్ :**

బీర్కూర్‌లో రూ.82 లక్షలతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని ఆదివారం జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పరిశీలించారు. ప్రస్తుతం బీర్కూర్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న జూనియర్ కళాశాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి కొత్త భవనం నిర్మించేందుకు డాగ్ బంగ్లా సమీపంలోని నీటిపారుదల శాఖ స్థలాన్ని ఆ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కళాశాలకు స్థలం కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులకు అనుమతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ విభాగీయ ఇంజనీర్ జగదీష్, సహాయ ఇంజనీర్ గజేందర్, తహసీల్దార్ సవాయి సింగ్, ఆర్ఐ విజయ్, జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

# మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




సిపిఎం మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేవల్ కిషన్ భవన్‌లో సామాజిక ఉద్యమ సారథుల జయంతి ఉత్సవాల సందర్భంగా "రాజ్యాంగం పరిరక్షణ సవాళ్లు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య హాజరయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అన్ని విధాలా అధోగతి పట్టించి, సహజ వనరులతో పాటు ప్రజాధనాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ ప్రజల్లో మత, కుల వైషమ్యాలను పెంచిపోస్తోందని విమర్శించారు. బీజేపీ పాలనలో ప్రమాదంలో పడిన దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాఖ్య స్ఫూర్తికి కేంద్ర ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని, సోదరభావంతో మెలగాల్సిన ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టి లౌకికతత్వానికి ముప్పు తెచ్చిందని ఆరోపించారు. రాజ్యాంగానికి మూలస్తంభాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన, సమాఖ్య వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. భారతదేశ సమగ్రత, ప్రజాస్వామ్య భద్రత లౌకికవాదంతో ముడిపడి ఉందని, రాజ్యాంగం దేశాన్ని లౌకిక రాజ్యంగా పేర్కొన్నదని తెలిపారు. హిందూ-ముస్లింల మధ్య విభేదాలను సృష్టించి మెజారిటీ ఆధారిత రాజకీయాలకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజలను మనుషులుగా చూసి వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారిని కులాలుగా, మతాలుగా విభజించి భావోద్వేగాలను రెచ్చగొడుతోందని అన్నారు. కులమతాలకు అతీతంగా పౌరుడిని పౌరుడిగా గుర్తించాలన్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందన్నారు. ఈ సదస్సులో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు జె. సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు కె. యశోద, కవిత, యాదగిరి, దుర్గ, స్వరూప, చంద్రం, కిష్టయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మాంసంతో నష్టాలు : బరువు పెరగడానికి కారణం**

ఫ్యాట్స్ ఎక్కువగా ఉండటం వల్ల ఒబేసిటీ వచ్చే అవకాశం ఉంటుంది. అధిక కాలరీలు శరీరంలో నిల్వ అవుతాయి.



## కాసర్ల నాగేందర్ రెడ్డికి "బెస్ట్ ఎన్ఆర్ఐ అవార్డు"

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా ప్రదానం



**ముద్ర, కరీంనగర్ :**

ఏఎన్ఎన్ - మహా అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ఆస్ట్రేలియాలో స్థిరపడిన ప్రముఖ ఎన్ఆర్ఐ శ్రీ కాసర్ల నాగేందర్ రెడ్డికి "బెస్ట్ ఎన్ఆర్ఐ అవార్డు" ప్రదానం చేయబడింది. ఆయన చేసిన సామాజిక సేవలు, కమ్యూనిటీ సేవలు, మేధోపర మైన కృషి, అలాగే సామాజిక సమస్య లపై రాసిన వ్యాసాల (కాలమ్స్)కు గాను ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందించారు. భారత కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ అవార్డును నాగేందర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు ప్రముఖులు అభినందిస్తూ, సమాజానికి ఆయన చేస్తున్న సేవలు మరింత మందికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. నాగేందర్ రెడ్డి గతంలో అనేకసార్లు "బెస్ట్ ఎన్ఆర్ఐ" అవార్డులను అందుకొ ని తన ప్రతిభను, సేవాభావాన్ని నిరూ పించుకున్నారు. గత సంవత్సరం ఆస్ట్రేలి యాలో జరిగిన ఓటింగ్‌లో అత్యధిక ఓట్లు సాధించి "బెస్ట్ కమ్యూనిటీ లీడర్" గా గుర్తింపు పొందారు. అంతకుముందు సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా జరి గిన ఓటింగ్‌లో అత్యధిక ఓట్లు సాధించి "బెస్ట్ ఎన్ఆర్ఐ"గా నిలిచారు. గత రెండు దశాబ్దాలుగా ఆయన వేలాది అంతర్జాతీయ విద్యార్థులకు ఉపా ధి అవకాశాలు, నివాస సదుపాయాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. విదేశాలలో మరణించిన వారి మృత దేహాలను స్వదేశానికి పంపించేందుకు (రిపాట్రియేషన్ సేవలు) కూడా నిరంత రం సేవలందిస్తున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పై చేయి

- ఫస్టియర్ లో 66.2, సెకండియర్ లో 70.58 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పెరిగిన ఉత్తీర్ణత
- మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వ సలహాదారు కేకే, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం ఉదయం 11 గంటలకు నాంపల్లి లోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఈ ఫలితాలు విడుదల చేశారు. ప్రథమ ఇంటర్‌లో 66.2 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 70.58 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. కాగా ఈ ఫలితాల్లో ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. ఫస్టియర్ పరీక్షలకు 4,89,123 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,23,807 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో ఉత్తీర్ణత శాతం 74.4 కాగా.. బాలుర ఉత్తీర్ణత శాతం 57.69గా ఉంది.

ద్వితీయ ఇంటర్ పరీక్షలకు మొత్తంగా 5,07,948 మంది విద్యార్థులు హాజరు కాగా.. 3,58,490 మంది (70.34శాతం) ఉత్తీర్ణుల య్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 78.65గా ఉండగా.. బాలుర ఉత్తీర్ణత 62.50 శాతంగా నమోదైంది.

ప్రథమ ఇంటర్‌లో 66.20 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 66.94 శాతం మంది, ఒకేషనల్‌లో 59.30 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో 75.34శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. జనరల్‌లో 75.61శాతం ఒకేషనల్‌లో 72.71శాతంగా ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం బాగానే ఉంది. బీసీ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 86శాతం (జనరల్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 96శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో (జనరల్) 90శాతం నమోదు కాగా.. ఒకేషనల్‌లో 98శాతంగా ఉంది. కేజీబీవీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 72శాతం, ఒకేషనల్‌లో 86శాతం ఉత్తీర్ణత కాగా.. సెకండ్ ఇయర్‌లో 82శాతం, ఒకేషనల్‌లో 94శాతంగా ఉంది. ప్రైవేటు అన్ ఎయిడెడ్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో (జనరల్) 77శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 65శాతంగా ఉంది. ద్వితీయ ఇంటర్‌లో 71శాతం (రెగ్యులర్) ఉత్తీర్ణత నమోదు కాగా.. ఒకేషనల్‌లో 51 శాతంగా ఉంది. సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం 77.66 కాగా, ద్వితీయ ఇంటర్‌లో 86.79శాతంగా ఉంది. సప్లిమెంటరీ పరీక్షలను త్వరలోనే నిర్వహించనున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా వెల్లడించారు. ఉత్తీర్ణత కాని విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తదుపరి విద్యను కొనసాగించేందుకు వీలుగా నెల రోజుల్లోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ పరీక్షల రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 13 నుంచి 20 వరకు అవకాశం ఇచ్చారు. మే 13 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్న యోగితా రాణా.. రెండు సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడ్వాన్స్‌డ్ ప్రాక్టికల్ పరీక్షలు మే 22న ప్రారంభమవుతాయని, వాటిని కూడా రెండు సెషన్లలో నిర్వహిస్తామన్నారు.



## రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ కేసులో నమిత్ శర్మ లీలలు

**ముద్ర డెస్క్:**

గత నెలలో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మాదక ద్రవ్యాల పార్టీ జరిగిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును తెలంగాణ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. ఈ క్రమంలో ఈ కేసుకు సంబంధించిన అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు నమిత్ శర్మ.. పోలీసులపై కాల్పులకు పాల్పడ్డాడు. నమిత్ శర్మది ఢిల్లీ. ఇతడు ఒక వ్యాపారి. కృత్రిమ మేధ సహాయంతో ఇతడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.. హోం శాఖ మంత్రి అమిత్ షా.. ఐసీసీ చైర్మన్ జై షా తో ఫోటోలు దిగినట్టు చూపించాడు. వారితో అత్యంత సన్నిహితమైన సంబంధం ఉందని నమ్మించాడు. రోహిత్ రెడ్డితో పరిచయం పెంచుకున్నాడు. అంతేకాదు, ప్రధానమంత్రి పుట్టిన రోజు వేడుకకు హాజరైనట్టు చెప్పాడు. దానికి సంబంధించిన ఫోటోలను కూడా బయటపెట్టాడు. నమిత్ శర్మ మాటలను పూర్తిగా నమ్మిన రోహిత్ రెడ్డి పలు సంస్థలలో పెట్టుబడులు పెట్టినట్టు తెలుస్తోంది. కేవలం రోహిత్ రెడ్డిని మాత్రమే కాకుండా, ఇంకా చాలామంది ప్రముఖులను అతడు తప్పుతోవ పట్టించినట్టు సమాచారం. ఈ కేసును అనేక విడతలుగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితులు పోలీసులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉంటున్నారు. దానివల్ల ఈ కేసు విచారణలో జాప్యం జరుగుతోంది.

మరోవైపు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ను పోలీసులు విచారించే అవకాశం కనిపిస్తోంది. విచారణ కు హాజరు కావడానికి అతడు గడువు కోరాడు. దీనికి దర్యాప్తు బృందం అంగీకరించింది. ఈ కేసులో అతని పాత్ర గురించి పోలీసులు మరిన్ని విషయాలు తెలుసుకోవాల్సి ఉంది. అది నిర్ధారణ అయిన తర్వాత.. అసలు ఏం జరిగిందనేది వెలుగులోకి వస్తుందని దర్యాప్తు బృందం అధికారులు చెబుతున్నారు.

# ఇరాన్ కు ఆయుధాలు ఇవ్వద్దు..

- చైనాకు ట్రంప్ సీరియస్ వార్నింగ్

**ముద్ర డెస్క్:**



ఇటీవలే పశ్చిమాసియా యుద్ధానికి రెండు వారాల బ్రేక్ పడింది. మరోవైపు ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో చైనాకు అమెరికా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. చైనా ఇరాన్‌కు రహస్యంగా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు వెలువడిన నివేదికలు అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపాయి. ఈ ఆరోపణలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, చైనా ఇటువంటి చర్యలు కొనసాగిస్తే 'తీవ్ర పరిణామాలు' ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి అమెరికా నౌకాదళం సీమైన్స్ తొలగింపులో నిమగ్నమై ఉందని, ఇరాన్ సైనికపరంగా ఓడిపోయినా చర్చలు మాత్రం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**రహస్యంగా ఆయుధాల సరఫరా..**

అమెరికా నిఘా వర్గాలు గుర్తించిన వివరాల ప్రకారం, చైనా ఇరాన్‌కు భారీ ఎత్తున ఆయుధాలు పంపిస్తోంది. భుజం మీద నుంచి ప్రయోగించే షార్ట్‌రేంజ్ మిసైల్ లాంచర్లు, ఆధునిక క్షిపణి వ్యవస్థలు, విమానాలు, డ్రోన్లను కూల్చే వ్యవస్థలు సరఫరా చేస్తున్నట్లు నిర్ధారించింది. ఈ ఆయుధాలు మూడు నాలుగు బోయింగ్ 747 సరకు విమానాల్లో చైనాలోని వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరి, ఇతర దేశాల మీదుగా రహస్య మార్గాల్లో టెహ్రాన్‌కు చేరుతున్నాయని వెల్లడించింది. వారం రోజుల్లో ఇవి ఇరాన్‌కు చేరే అవకాశం ఉంది. చైనా తన పేరు బయటకు రాకుండా ఉండేందుకు ఈ పరోక్ష మార్గాలను ఎంచుకుంటోందని పేర్కొంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తాము అమెరికా విమానాలను విజయవంతంగా కూల్చడానికి 'ఆధునిక రక్షణ వ్యవస్థలే' కారణమని పేర్కొంది. అవి చైనా నుంచి వచ్చినవేనని అమెరికా నిఘా వర్గాలు నమ్ముతున్నాయి.

**ట్రంప్ హెచ్చరిక..**

ఈ ఆరోపణలపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. చైనా ఇరాన్‌కు ఆయుధాలు పంపడం మానుకోవాలని, లేకపోతే బీజింగ్‌కు 'వినాశకర పరిణామాలు' తప్పవని హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్య యుద్ధంలో చైనాకు 200% టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని గతంలోనే ప్రకటించిన ట్రంప్, ఈసారి మరింత కఠినంగా మాట్లాడారు. 'మాకు నాటో నుంచి ఎటువంటి సాయం లభించలేదు. అయినా ఇరాన్‌ను సైనికపరంగా ఓడించాం. చర్చలు విఫలమైనా అంతిమ విజయం మాదే,' అని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను 'తుడిచిపెట్టేస్తామని' ఆయన బహిరంగంగా హెచ్చరించారు.

**ఖండించిన చైనా...**

వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే, ఇరాన్ అధికారికంగా చైనా ఆయుధాలు అందినట్లు వెల్లడించకపోయినా, తమ వద్ద ఉన్న ఆధునిక వ్యవస్థల సామర్థ్యాన్ని బట్టి చూస్తే చైనా సాయం స్పష్టంగా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాకు ఇరాన్ నుంచి రోజుకు 20 లక్షల బ్యారెళ్ల ముడిచమురు సరఫరా అవుతోంది. ఈ ఆర్థిక బంధమే చైనా ఇరాన్‌కు రహస్య సాయం చేయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**మధ్య ప్రాచ్యంలో కీలక పరిణామాలు**

ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో కొత్త శక్తి సమీకరణాలకు దారితీస్తున్నాయి. చైనా-ఇరాన్ బంధం మరింత బలపడటం, ఆర్థిక, సైనిక సహకారం పెరగడం వల్ల అమెరికాకు ఇది సవాల్‌గా మారింది. నాటో దేశాలు ఈ యుద్ధంలో అమెరికాకు సాయం చేయకపోవడంతో అగ్రరాజ్యం ఒంటరిగా మారింది. హర్మూజ్ గుండా చమురు రవాణా ఆలస్యం కావడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది. చైనా ఆయుధ సరఫరా ఇరాన్‌కు ఊపిరి పోసింది. అమెరికా సైనికపరంగా విజయం సాధించినా, చర్చలు విఫలమవడం మరియు చైనా రహస్య సాయం యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేశాయి. ట్రంప్ హెచ్చరికలను చైనా లెక్కచేయకపోతే, అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరే ప్రమాదం ఉంది. హర్మూజ్ జలసంధి తెరవడం, ఇరాన్‌తో చర్చలు విజయవంతం కావడంపై మధ్యప్రాచ్య భవిష్యత్ ఆధారపడి ఉంది.

## తొలి జీతం అన్నదాతలకే..

- ఉదారత చాటుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మనస్వి

**ముద్ర, డెస్క్ :**

తన తొలి జీతం రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు దానం చేసి ఉదారతను చాటుకుంది ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ (ఏటిగడ్డ కిష్టాపూర్)కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులి రాజు కుమార్తె పులి మనస్వి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం సాధించారు.

ఈ నెల 10న మనస్వి తన మొదటి నెల వేతనాన్ని అందుకున్నారు. ఆ డబ్బును తన సొంత అవసరాలకు వాడుకోకుండా రైతు కుటుంబాలకు వెచ్చించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఐదుగురు బాధిత రైతు కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదుతో పాటు చీరలను అందజేశారు. చిన్న వయసులోనే సామాజిక బాధ్యతను చాటుకుని, ఆపదలో ఉన్న రైతు కుటుంబాలకు అండగా నిలిచిన మనస్విని పలువురు ప్రముఖులు, గ్రామస్థులు అభినందించారు.



# విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ వేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు విద్యుత్ డిస్కంలను ప్రైవేటు పరం చేస్తారన్న ప్రచారం జరుగుతుందని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు, ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్యుత్ డిస్కంలను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరించమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అసత్య ప్రచారాలను ఖండించాలన్నారు. ఇంధన శాఖ దీర్ఘకాలం కొనసాగాలని అందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రజా ప్రభుత్వం చేపడుతుందని భట్టి తెలిపారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉద్యోగుల జేఏసీ, అధికారులపై ఉందని తెలిపారు. 1912 కు వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కారం చేసి మెరుగైన సేవలకు విద్యుత్ సంస్థలు చిరునామాగా నిలవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఇతర అంశాలు విని పరిష్కరించేందుకు ఉద్యోగ సంఘాలకు ప్రతినెల ఒక గంట పాటు సమయం ఇచ్చేలా విద్యుత్ సంస్థల ఉన్నత అధికారులను ఆదేశిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. మూడవ డిస్కం ఏర్పాటు ఉద్యోగుల సర్దుబాటు, 2026 పీఆర్సీ, 2004 వరకు నియామకమైన వారికి పాత పెన్షన్స్ స్కీమ్ అమలు, రెగ్యులర్ ప్రమోషన్స్, రిక్రూట్మెంట్స్, ఆర్టిజన్ సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డిప్యూటీ సీఎం కు వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో కన్వీనర్ బీసీ రెడ్డి, నాయకులు భూపాల్ రెడ్డి, సదానందం, స్వామి, రమేష్, అశోక్, సుధాకర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, దయానంద్, శివశంకర్, జనప్రియ, మల్లయ్య, ప్రమోద్ పాల్గొన్నారు.

### జాతీయస్థాయిలో సమగ్ర కుల జన గణన జరగాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

జాతీయస్థాయిలో సమగ్ర కుల జన గణన జరిగితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా "క్యాస్ట్ సెన్సెస్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్ " అనే పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహించే జన గణనలో అన్ని కులాల సామాజిక, విద్య,ఆర్థిక స్థాయిలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, దేశవ్యాప్తంగా సమగ్ర కుల జన గణన చేపట్టడానికి అది మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పరిపాలనను బలోపేతం చేయడంలో, సామాజిక న్యాయాన్ని మరింత లోతుగా స్థాపించడంలో కుల లెక్కింపు ప్రాధాన్యతను ఈ గ్రంథం స్పష్టంగా ప్రతిపాదిస్తుందని రచయితలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పుస్తక ఆవిష్కరణ అనంతరం డిప్యూటీ సీఎం బీసీ ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, మేధావులు, విద్యార్థుల జాయింట్ యాక్షన్ కమిటీ, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతొ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో క్యాస్ట్ సెన్సెస్ అండ్ డీపెనింగ్ ఆఫ్ సోషల్ జస్టిస్ పుస్తక రచయిత, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిసర్చ్ స్కాలర్ జి కిరణ్ కుమార్, డాక్టర్ వాహిని బిల్లు పాల్గొన్నారు. డి అశోక్, సురేందర్, గణేష్, శివ, అరవింద్, లక్కీ, ప్రవీణ్, మల్లేష్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మాంసంతో నష్టాలు : జీర్ణ సమస్యలు కలగవచ్చు
మాంసం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అధికంగా తింటే గ్యాస్, అజీర్ణం సమస్యలు వస్తాయి.

# జగన్ రాజకీయాలు ఉగ్రవాదం కంటే భయంకరం

- నీచమైన భాష వైసీపీ సంస్కృతికి నిదర్శనం
- రాజకీయాల కోసం సొంత బాబాయ్‌నే గొడ్డలితో వేటు
- తల్లిని, చెల్లిని బయటకు గెంటిన జగన్.. మహిళా పక్షపాతా?
- రంగాను అవమానించిన గౌతమ్ రెడ్డికి పదవులా?
- మంత్రి నిమ్మల రామానాయుడు

**ముద్ర, మంగళగిరి:**



ఏపీలో జగన్మోహన్ రెడ్డి రాజకీయాలు, ఉగ్రవాదులను మించిన ఉన్మాదంతో సాగుతున్నాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్సిగ్గుగా విధ్వంసకర విధానాలతో రాష్ట్రాన్ని నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ పనిచేస్తోందని ఆయన విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి తన హిడెన్ అజెండాను ఇప్పుడు బహిరంగంగానే ప్రజలకు చెబుతున్నారని అన్నారు. చంపేస్తాం, నరికేస్తాం, అంతుచూస్తాం అనే నీచమైన భాషను వాడుతూ రాజకీయాలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉందన్నారు. రాజకీయాలకు అడ్డువస్తే సొంత బాబాయ్‌నైనా గొడ్డలిపోటుతో అంతం చేస్తామనే భయంకరమైన సందేశాన్ని ప్రజల్లోకి పంపుతున్నారన్నారు. వైసీపీ 'యూత్ పాలసీ' అంటే మద్యం వ్యాపారాలు చేయడం, కొత్త కొత్త మాదక ద్రవ్యాలను అందుబాటులోకి తెచ్చి యువత భవిష్యత్తును నాశనం చేయడమేనా? అని మంత్రి ప్రశ్నించారు. ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన నాయకులే బాహాటంగా హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. నిజాలను నిర్భయంగా వెల్లడిస్తున్న ఏబీఎన్, వారి ప్రతినిధులపై ఆ పార్టీ నేతలు ఉన్మాదంతో మాట్లాడుతున్నారన్నారు. వివేకానందరెడ్డి గొడ్డలిపోటుతో హత్యకు గురైతే, దాన్ని 'గుండెపోటు' అని సాక్షి పేపర్, ఛానళ్లలో ఎందుకు ప్రచారం చేశారు? సొంత చిన్నాన్న చనిపోతే గంటలో రావాల్సిన వ్యక్తి, 12 గంటలు ఆలస్యంగా వచ్చి సాక్ష్యాలు చెరిపేయడంలో నిమగ్నమవ్వడం దేనికి సంకేతం? ప్రపంచ చరిత్రలో ఎక్కడైనా చనిపోయిన వ్యక్తికి కుట్లు వేసి, డ్రెస్సింగ్ చేసి హత్యను కప్పిపుచ్చే ప్రయత్నం ఎవరైనా చేస్తారా? అని జగన్ రెడ్డిని నిలదీశారు. పరిటాల రవి హత్య కేసు నుంచి బయటపడటానికి జగన్‌కు ఆరు నెలలు పట్టిందని మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి గతంలోనే చెప్పారు. ఆనాడు పరిటాల రవి కేసులో సాక్షులు ఎలాగైతే ఒక్కొక్కరుగా మాయమయ్యారో, నేడు వివేకా హత్య కేసులో కూడా సాక్షులను అదే రకంగా మాయం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి జగన్ సమాధానం చెప్పాలన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించి, ఆయన ఆచూకీ కూడా లభించని విషాద సమయంలో సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి కావాలని చూడటం జగన్ రెడ్డి వికృత మనస్తత్వానికి నిదర్శనమన్నారు. తండ్రి మరణానికి రిలయన్స్ సంస్థ కారణమని దాడులు చేయించి, నేడు అదే సంస్థకు రాజ్యసభ పదవులను ఎలా ఇచ్చారన్నారు. వంగవీటి రంగా గురించి కానీ, కాపు సామాజికవర్గం గురించి కానీ మాట్లాడే కనీస నైతిక అర్హత జగన్మోహన్ రెడ్డికి లేదని మంత్రి ఘాటుగా విమర్శించారు. రంగా హంతకులను అక్కున చేర్చుకున్న చరిత్ర జగన్ రెడ్డిదని ధ్వజమెత్తారు. వంగవీటి రంగా హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి కుమారుడు ఈరోజు ఏ పార్టీలో ఉన్నారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రంగాను పొట్టనబెట్టుకున్న కుటుంబానికి హైదరాబాద్‌లో కోట్లాది రూపాయల విలువైన భూమిని 'గిఫ్ట్'గా ఎందుకు ఇచ్చారో ప్రజలకు వివరించాలన్నారు. రంగాను రౌడీ అని పిలుస్తూ, కాపుల మనోభావాలను దెబ్బతీసిన గౌతమ్ రెడ్డిని జగన్ ఎందుకు అక్కున చేర్చుకున్నారని, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి 'ఫైబర్ గ్రిడ్ ఛైర్మన్' పదవి ఇచ్చి సత్కరించడం రంగాపై జగన్ రెడ్డికి ఉన్న విద్వేషానికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. నాడు తండ్రి పదవిని అడ్డం పెట్టుకుని ఆర్థిక వ్యవస్థను కలుషితం చేసిన జగన్ రెడ్డి, పార్టీ పెట్టిన తర్వాత రాజకీయ వ్యవస్థను, అధికారంలోకి వచ్చాక పరిపాలనా వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. అధికారులను, రాజకీయ నాయకులను సైతం తన నేర స్వభావంతో కలుషితం చేసిన వ్యక్తికి రాజకీయాల్లో ఉండే అర్హతే లేదన్నారు. 2014లో జరిగిన రాష్ట్ర విభజన కంటే, 2019-24 మధ్య జరిగిన వైసీపీ ఐదేళ్ల పాలన వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రంలోని ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని మళ్లీ పట్టాలెక్కిస్తున్నారని, అభివృద్ధివైపు నడిపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతుంటే, మళ్లీ విధ్వంసం సృష్టించాలని జగన్ రెడ్డి ప్లాన్ చేస్తున్నారని అన్నారు. గొడ్డలిని జెండాగా, వినాశనాన్ని అజెండాగా పెట్టుకున్న ఈ 'గొడ్డలి పార్టీ'కి రాజకీయ సమాధి కట్టాల్సిన సమయం ఆసన్నమైందని, ఇలాంటి ఉన్మాద పార్టీని రాష్ట్రంలో లేకుండా శాశ్వతంగా రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ఈ రాక్షస పాలన పోకడలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.



## పాగుంట వెంకన్న స్వామివారిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** కేటిదొడ్డి మండలం వెంకటాపురంలో వెలసిన పాగుంట శ్రీక్ష్మీవెంకటేశ్వర స్వామి వారిని ఆదివారం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన బీజేపీ మండల నాయకులు భీంరెడ్డి కుమారుడు వివాహ వేడుకల్లో పాల్గొన్ని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, నల్లారెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, అనిమిరెడ్డి, హంపిరెడ్ఢి, సర్పంచ్ రాజేష్, కృష్ణారె పాల్గొన్నారు.

## 'ఆశా ది గ్రేట్' మరణం బాధాకరం

**ముద్ర, అమరావతి:**



ఏడు దశాబ్దాలపాటు భారతీయ సంగీత ప్రియులను తన అజరామరమైన గాత్ర మాధుర్యంతో ఓలలాడించిన మహోన్నత గాయని ఆశా బోన్సులే మరణం బాధాకరమని ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందీతో పాటు అనేక భారతీయ భాషల్లో ఆశా బోన్సులే పాడినన్ని వైవిద్య భరితమైన పాటలు దేశంలో మరే ఇతర గాయని పాడలేదని అన్నారు. తాను నటించిన అశ్వమేధంలో ఆశాబోన్సులే రెండు యుగళ గీతాల్లో పాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఓపీ నయ్యర్, ఆర్ డీ బర్మన్ సంగీత దర్శకత్వంలో ఆశాజీ పాడిన అద్భుతమైన పాటలు ఎవర్ గ్రీన్ గా నిలిచి పోతాయన్నారు. పద్మ విభూషణ్ తో పాటు ఎన్నో అవార్డ్స్ ఆమె సొంతమయ్యాయని అన్నారు. ఇప్పట్లో మరో ఆశాజీని చూడలేమని అన్నారు. అందుకే ఆమె ఆశా ది గ్రేట్ అని కొనియాడారు. ఆశా బోన్సులే మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ట్రంప్, పాకిస్తాన్ శాంతిదూతలా..?

**ముద్ర డెస్క్ :** పశ్చిమాసియా యుద్ధం తాత్కాలికంగా ఆగింది. ఇరాన్, అమెరికా మధ్య రెండు వారాల సీజ్‌ఫైర్ కుదిరింది. అయినా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తోంది. ఈ తరుణంలో తాత్కాలిక సీజ్‌ఫైర్‌ను శాశ్వత శాంతిగా మార్చేందుకు పలు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. అయితే ఇదంతా తామే చేశామని పాకిస్తాన్ కాలర్ ఎగరేస్తోంది. ఇప్పటికే డొనాల్డ్ ట్రంప్ తాను ప్రపంచ యుద్ధాలు ఆపానని, తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని గతేడాది నానాయాగి చేశాడు. ఇక ఇప్పుడు పాకిస్తాన్ కూడా తాము శాంతి దూరతలమని చెప్పుకుంటోంది. శాంతి చర్చలకు ఇస్లామాబాద్‌ను వేదిక చేసింది. ఇదంతా ట్రంప్ వెనక ఉండి నడిపిస్తున్న నాటకమే అని ఇరాన్ ఆరోపిస్తోంది. అమెరికాను, పాకిస్తాన్‌ను అంత ఈజీగా నమ్మమని ప్రకటించింది. మరోవైపు ఉగ్రవాదులకు నిలయమైన పాకిస్తాన్ తాము శాంతి దూతగా ప్రచారం చేసుకోవడం చూసి ప్రపంచం నవ్వుతోంది.

**సమస్యల పరిష్కారంపై భారత్ దృష్టి..**

యుద్ధానికి ముదే పాకిస్తాన్ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. యుద్ధం, హర్మూజ్ మైసివేత కారణంగా పాకిస్తాన్ పరిస్థితి లాక్‌డౌన్ వరకు వచ్చింది. శాంతి చర్చలకు కూడా డబ్బులు లేక పోవడంతో ప్రజలపై భారం మోపింది. పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంచింది. మరోవైపు యుద్ధ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించడంపై భారత్ దృష్టిపెట్టింది. సార్వభౌమత్వాన్ని ముందుగా పెట్టుకుని, దీర్ఘకాలిక భద్రతా వ్యూహాన్ని రూపొందిస్తోంది.

**ట్రంప్ మాటలు నీటిమీది రాతలే..**

డొనాల్డ్ ట్రంప్ 2019లో భారత-పాక్‌తో మాట్లాడి శాంతి తెచ్చేస్తాను అని ప్రకటించారు. అది ఎన్నికల ప్రచార హామీగా మిగిలిపోయింది. తాజాగా ఆపరేషన్ సిందూర్ తానే ఆపానని ప్రచారం చేసుకున్నాడు. దీంతో పాకిస్తాన్ ట్రంప్‌ను 'శాంతి దూత'గా ప్రచారం చేసింది. కానీ ప్రజలు దాన్ని జోకుగా చూస్తున్నారు. ఇక ఇప్పుడు పాకిస్తాన్ చేసుకుంటున్న ప్రచారాన్ని కూడా చూసి జనం జోకులేసుకుంటున్నారు. నిషేధిత ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ నిలయం. ఇలాంటి దేశం.. తాము శాంతి దూతలం అని చెప్పుకోవడం నవ్విపోదురుగాక, నాకేటి సిగ్గు అన్న చందంగా మారింది.

**శాంతి ప్రచారం వెనుక బలహీనత**

పాకిస్తాన్ తనను శాంతి ప్రేరకుడిగా చూపించుకుని, ట్రంప్‌కు దగ్గరవ్వాలని చూస్తోంది. భారత్ మాత్రం 26/11 ముంబై, బాలాకోట్, పఠాన్‌కోట్‌పై జరిపిన ఉగ్రదాడులను గుర్తు చేస్తోంది. వీలైనంత ఎక్కువగా పాకిస్తాన్‌ను డ్యామేజ్ చేయాలని చూస్తోంది. ఈ రాజకీయ డైనమిక్స్ భారతదేశానికి అవకాశాలను తెరుస్తోంది. ట్రంప్ లాంటి నాయకులపై ఆధారపడకుండా, బలపడుతూ, దక్షిణాసియా ఆధిపత్యాన్ని స్థిరపరచుకోవచ్చు. పాకిస్తాన్‌కు ఇది మార్పు సమయం. ఉగ్రవాదాన్ని వదులుకుని, నిజమైన శాంతి దేశంగా గుర్తింపు తెచ్చుకుంటే మంచింది.



## ఆశా భోంస్లే జీవితంలో ఎన్నో కన్నీటి చారికలు

- కట్టుకున్నవాడు కాదన్నాడు.. గర్భిణిగా ఉన్నప్పుడు అత్తింటి వారి గెంటేశారు..

**ముద్ర డెస్క్ :**




ఆమె పాడుతుంటే కోయిలలు శ్రద్ధగా వింటాయి. ఆమె గజల్ సరికొత్త ఉత్సాహం ఇస్తుంది. ఆమె మెలోడీ ఆనంద విహారం చేయిస్తుంది. ఆమె ట్రాజెడీ కన్నీటి చారికలను ప్రవహించేలా చేస్తుంది. ఒకటా రెండా.. లెక్కకు మిక్కిలి ప్రయోగాల. ఆమె గొంతులో ఏముందో తెలియదు. ఆమె గాత్రంలో ఏ మహత్తు దాగి ఉందో తెలియదు. గొంతు దాటిన పాట కోట్లాదిమందిని రంజింపజేసింది. తన మాట ఎంతోమందిలో స్ఫూర్తిని కలిగించింది. అలాంటి సంగీత సరస్వతి.. పాటల మంజరి ఆశా భోంస్లే.. కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ఇక సెలవంటూ కోట్లాదిమంది అభిమానులను దుఃఖంలో ముంచేస్తూ సెలవు తీసుకున్నారు.. ఆశా భోంస్లే జీవితం వడ్డించిన విస్తరి కాదు. ఆమె యుక్త వయసులో ఉన్నప్పుడే ప్రేమలో పడ్డారు. ఆమె ప్రేమను చాలామంది వ్యతిరేకించారు. కుటుంబ సభ్యులు వద్దన్నారు. అయినప్పటికీ ప్రేమించిన వాడే లోకంగా ఆమె బయటికి వచ్చారు. వివాహం చేసుకున్నారు. గర్భం దాల్చారు. ఒకానొక దశలో అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకున్నారు.. కడుపులో పెరుగుతున్న బిడ్డ గుర్తుకురావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. కట్టుకున్నవాడు హింసిస్తుంటే ఓర్పుతోనే భరించారు. అత్తింటివారు వేధింపులకు గురి చేస్తుంటే పంటి బిగువన తట్టుకున్నారు.

**మహారాష్ట్రలో పుట్టింది**

ఆశా భోంస్లే మహారాష్ట్రలో సాంగ్లీలో 1933 సెప్టెంబర్ 8న పుట్టారు. ఆశా భోంస్లే సోదరి పేరు లతా మంగేష్కర్. ఉమా, మీనా అనే అక్క చెల్లెలు కూడా ఆశా భోంస్లే కు ఉన్నారు. హృదయనాద్ అనే సోదరుడు కూడా ఉన్నాడు. 9 సంవత్సరాల వయసులో ఆశ తన తండ్రిని కోల్పోయారు. కుటుంబ బాధ్యత మొత్తం లత మీద పడింది. అప్పట్లో ఆమె పాటలు పాడుతూ ఉండేది. అక్క పడుతున్న కష్టాన్ని చూడలేక ఆశ కూడా పాటలు పాడేది. చిన్నప్పటినుంచి ఆశ క్లాసికల్, గజల్, విరహం, విషాదం, రొమాంటిక్ పాటలు పాడేది. అవన్నీ కూడా ఆమెకు అలబోకగా వచ్చేశాయి. సుమారు 14 భాషలలో పాడారు ఆశ. వేలాది పాటలు ఆమె గాత్రం నుంచి వచ్చాయి. ఈమె పాడిన దమ్ మారో దమ్ పాట కొన్ని కోట్ల మందిని ఉర్రూతలూగించింది. 16 సంవత్సరాల వయసులో ఆశ లతా మంగేష్కర్ పిఎ.. 31 సంవత్సరాల వయసు ఉన్న గణపత్ రావ్ భోంస్లే ను వివాహం చేసుకున్నారు. దీని లత వద్దన్నారు. ఆశ చేసిన పనితో లత తీవ్రమైన కలతకు గురయ్యారు. చాలా సంవత్సరాలు పాటు తన సోదరుతో ఆమె మాట్లాడలేదు.. గణపత్ ఆశను పెళ్లి చేసుకున్న తర్వాత.. లతతో ఎటువంటి సంబంధాలు నడపకూడదని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు ఆశను డబ్బు కోసం వేధించడం మొదలుపెట్టారు. ఆశను కోడలిగా గణపత్ కుటుంబం ఆమోదించలేదు. ఆశ గర్భిణిగా ఉన్నప్పుడు గణపత్ కుటుంబం ఆమెను ఇంట్లో నుంచి గెంటివేసింది. భర్త కూడా తీవ్రంగా కొట్టాడు. ఆ సమయంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించాలని భావించింది ఆశ. ఒక బాటిల్ నిద్ర మాత్రలు మింగింది ఆశ. చివరికి ఆసుపత్రి పాలైంది. కోలుకున్న తర్వాత.. కొద్ది రోజులు ఒంటరి జీవితాన్ని గడిపింది. చివరికి 1960లో తన భర్త నుంచి విడిపోయింది.

## యుద్ధంలో 3375 మంది ఇరానీయులు మృతి!

**ముద్ర డెస్క్ :**



దాదాపు నలభై రోజులుగా అమెరికాఇజ్రాయెల్‌లు సంయుక్తంగా చేసిన దాడుల్లో 3375 మంది పౌరులు మృతి చెందినట్లు ఇరాన్ (Iran) పేర్కొంది. వీరిలో 2875 మంది పురుషులు, 500 మంది మహిళలు ఉన్నట్లు ఇరాన్ ఫోరెన్సిక్ మెడిసిన్ ఆర్గనైజేషన్ చీఫ్ అబ్బాస్ మస్జేది అరానీ వెల్లడించారు. అమెరికాతో పాకిస్థాన్ వేదికగా జరిగిన చర్చలు విఫలమైన వేళ ఇరాన్ అధికారులు ఈ గణాంకాలు విడుదల చేయడం గమనార్హం. మరోవైపు, లెబనాన్‌లోనూ హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు సుమారు రెండు వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. ఇటీవల ఒక్కరోజే దాదాపు 300 మంది చనిపోయారు. ఈ క్రమంలో అమెరికాఇరాన్‌ల మధ్య జరిగిన చర్చల్లోనూ లెబనాన్‌పై దాడుల అంశం కూడా ప్రధానంగా నిలిచింది.

## జూరాల జలాశయంలో దూకి యువకుడి ఆత్మహత్య

- ధరూర్ ఎస్ఐ నందీకర్ ఆధ్వర్యంలో జలాశయంలో గాలింపులు
- చీకటి పడటంతో నిలిపివేసిన గాలింపు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జూరాల జలాశయంలో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డిన ఘటన శనివారం సాయంత్రం ధరూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ధరూర్ ఎస్సై నందీకర్ తెలిపిన వివరాల ప్రకారం జడ్చర్లకు చెందిన చాణక్య(28) హెటిరో ఫార్మాలో పని చేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చాణక్య శనివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై జడ్చర్ల నుంచి జూరాల ప్రాజెక్టుకు చేరుకున్నారు. శనివారం సాయంత్రం జూరాల ప్రాజెక్టు పై ఎవరు లేని సమయంలో 51వ గేటు వద్ద బ్యాక్ వాటర్ లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. 51వ గేటు వద్ద మృతుడి ద్విచక్ర వాహనాన్ని గుర్తించినట్లు చెప్పారు. ఆదివారం ధరూర్ ఎస్ఐ నందీకర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక శాఖ సిబ్బంది, స్థానిక జాలర్ల సాయంతో జూరాల ప్రాజెక్టులో గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి వరకు మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు అనారోగ్య సమస్యలేనని మృతుడి సోదరుడు పోలీసులకు వెల్లడించినట్లు తెలిసింది. సోమవారం ఉదయం యదావిధిగా గాలింపు చర్యలు చేపట్టనున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## మాంసంతో నష్టాలు : క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది

ప్రాసెస్ చేసిన మాంసం ఎక్కువగా తింటే క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కోలోరెక్టల్ క్యాన్సర్‌కు సంబంధం ఉంది.



## ఏం బౌలింగ్ సామీ..

### టీమిండియాలో రీఎంట్రీ గ్యారెంటీ



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

గొప్ప గొప్ప బౌలర్లు తేలిపోతున్నారు. పరుగులు ఇస్తూ చేతులెత్తేస్తున్నారు. ఇతడు మాత్రం బంతితో మ్యాజిక్ చేస్తున్నాడు. వికెట్లను పడగొడుతూ అదరగొడుతున్నాడు.. పిచ్‌తో సంబంధం లేకుండా.. బ్యాటర్ ఎవరనేది పట్టించుకోకుండా దుమ్ము రేపుతున్నాడు.. మామూలుగా అయితే ఐపీఎల్‌లో పరుగుల పేరడైజ్ కొనసాగుతూ ఉంటుంది. కానీ, ఇతడు వికెట్లను పడగొడుతూ సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జట్టు తరఫున ఆడుతున్నాడు ప్రసిద్ కృష్ణ. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్లు ఆడాడు. ఇందులో 16 ఓవర్ల పాటు బౌలింగ్ వేశాడు. 152 పరుగులు ఇచ్చాడు. ఒకసారి నాలుగు వికెట్ల ఘనతను సాధించాడు. మొత్తంగా 10 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. 15.20 యావరేజ్ తో కొనసాగుతున్నాడు. ఆదివారం లక్నోతో జరిగిన మ్యాచ్లో.. ప్రసిద్ కృష్ణ దుమ్మురేపాడు. ప్రారంభం నుంచి కట్టుదిట్టంగా బౌలింగ్ వేశాడు. 4 ఓవర్ల పాటు బౌలింగ్ వేసిన ఇతడు కేవలం 28 పరుగులు ఇచ్చాడు. నాలుగు వికెట్లు పడగొట్టాడు.. ప్రమాదకరమైన మార్క్రం(30), ఆయుష్ బదోని (9), పూరన్(19), ముకుల్ చౌదరి(18) వికెట్లను పడగొట్టాడు.. ముఖ్యంగా సీమ్ ఆఫ్ డెలివరీలు వేసి సంచలనం సృష్టించాడు.. బంతితో పేస్ జనరేట్ చేసినప్పటికీ.. బ్యాటర్లు పరుగులు తీయకుండా జాగ్రత్త పడ్డాడు. ప్రసిద్ కు తోడుగా మహమ్మద్ సిరాజ్ బౌలింగ్ వేసాడు. ఇతర కూడా నాలుగు ఓవర్ల పాటు బౌలింగ్ వేసి.. కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఒక వికెట్ పడగొట్టాడు. దీంతో లక్నో జట్టు స్కోరు 20 ఓవర్లకు.. 8 వికెట్లు నష్టానికి 164 పరుగుల వద్ద ఆగిపోయింది. లక్నో జట్టులో ఓపెనర్ మార్క్రం చేసిన 30 పరుగులే టాప్ స్కోర్ అంటే.. గుజరాత్ బౌలర్ల బౌలింగ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. లక్నో లో జరుగుతున్న ఈ మ్యాచ్లో ముందుగా.. పంత్ జట్టు బ్యాటింగ్ చేసింది. అయితే ప్రారంభం నుంచి గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ వేశారు. లక్నో బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. దీంతో ఒక దశలో లక్నో జట్టు కనీసం 150 పరుగులైనా చేయగలుగుతుందా అనే అనుమానం కలిగింది. ఆ తర్వాత లక్నో జట్టు బ్యాటర్లు చివర్లో పరుగులు తీయడంతో ఆ స్కోరు సాధ్యమైంది. ప్రసిద్ అద్భుతంగా బౌలింగ్ వేస్తున్న నేపథ్యంలో.. టీమిండియాలో అతడికి మళ్ళీ చోటు లభించడం ఖాయమని వార్తలు వినిపిస్తున్నాయి. జూన్లో ఆఫ్ఘనిస్తాన్ జట్టుతో జరిగే టోర్నీలో అతడికి అవకాశం లభిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. అదే గనుక జరిగితే.. తన పునరాగమనాన్ని ఘనంగా చాటితే ప్రసిద్ కు తిరుగుండదని అభిమానులు చెబుతున్నారు.

## డగౌట్‌లో ఫోన్ వాడకం..బీసీసీఐ సీరియస్

### వైభవ్ 'గార్డియన్' రోమీపై బీసీసీఐ చర్యలు




**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమీ భిందర్‌పై బీసీసీఐ ఫోకస్ పెట్టింది. డగౌట్‌లో ఫోన్ వాడుతూ వీడియోల్లో కనిపించడంతో బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఫ్రాంచైజీ ప్లేయర్లు, సిబ్బంది ఫోన్లను వినియోగించుకొనే అవకాశం ఉంది. డగౌట్‌లోకి మాత్రం అనుమతించరు. కానీ, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ సమయంలో రోమీ ఫోన్‌తో ఉన్నట్లు వీడియోలు బయటకు వచ్చాయి. ఓ ఇన్‌ఫ్లూయన్సర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. దీనిపై బీసీసీఐ తొలిసారి స్పందించింది. "అవును ఆటగాళ్లు, మ్యాచ్ అధికారుల ప్రదేశం (పీఎంఓఏ) వద్ద ఎవరూ సెల్ ఫోన్లను వాడకూడదు. కానీ, భిందర్ మాత్రం ఆ నిబంధనలను ఉల్లంఘించారు. టీమ్ మేనేజర్ కూడా డ్రెస్సింగ్ రూమ్‌లో ఫోన్‌ను వినియోగించే అవకాశం ఉంది. కానీ, డగౌట్‌లో వాడకూడదు. అయితే, భిందర్ విషయంలో అనుకోకుండా ఇలా జరిగి ఉండొచ్చు. నిబంధనల ఉల్లంఘన కిందికే వస్తుంది. కాబట్టి, చర్య తీసుకోవాలి. హెచ్చరిక ఇస్తారా? లేదా ఏదైనా చర్య తీసుకుంటామా? అనేది ఇప్పుడే చెప్పలేం. మ్యాచ్ రిఫరీతోపాటు అవినీతి నిరోధక యూనిట్ నివేదిక ప్రకారమే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ తుది నిర్ణయం ఉంటుంది" అని బీసీసీఐ పేర్కొంది.




## ఇలాగైతే వైభవ్ సూర్య వంశీ కెరియర్ ముగిసినట్లే..

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ప్రస్తుత ఐపిఎల్ లో అత్యంత వేగంగా ఆడుతున్న ఆటగాడు.. మంచినీళ్లు తాగినంత ఈజీగా సిక్సర్లు కొడుతున్న ఆటగాడు.. జెర్సీ వేసుకున్నంత సులభంగా ఫోర్లు కొడుతున్న ఆటగాడు.. ప్రారంభం నుంచి పెవిలియన్ చేరుకునే వరకు ఒకే టెంపోలో ఆడుతున్న ఆటగాడు.. ఇన్ని ఉపమానాలకు దొరికిన ఏకైక పదం వైభవ్ సూర్య వంశీ. 15 సంవత్సరాల వయసులో ఇతడు ఐపీఎల్లో సృష్టిస్తున్న అద్భుతాలు మామూలువి కావు. గొప్ప గొప్ప ఆటగాళ్లు సైతం ఊహించడానికి భయపడే రికార్డులను ఇతడు అవలీలగా దాటేస్తున్నాడు. వైభవ్ సూర్య వంశీ ఆట గురించి ఇప్పటికే ఆటగాళ్లు, మాజీ ఆటగాళ్లు గొప్పగా చెప్పేశారు. చెబుతూనే ఉన్నారు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరఫున ఆడుతున్న సూర్య వంశీ.. ప్రతి మ్యాచ్లో కూడా కొత్తగా కనిపిస్తున్నాడు. దూకుడుగా ఆడటం.. ప్రారంభం నుంచి ఎదురుదాడికి దిగడం వంటివి చేస్తున్నాడు. దీనివల్ల బౌలర్లలో మానసిక స్థైర్యం తగ్గిపోతుంది. ఇదే అదునుగా వైభవ్ తన బ్యాట్ కు మరింత పదును పెడుతున్నాడు. చూస్తుండగానే విధ్వంసాన్ని సృష్టించి వెళ్ళిపోతున్నాడు. వైభవ్ ఆడుతున్నంత సేపు కొండంత లక్ష్యం సైతం ఇసుక రేణువు లాగా మారిపోతుంది. ఇది ఒక రకంగా ప్రత్యర్థులకు తీవ్రమైన ఇబ్బంది కలిగిస్తోంది. సూర్య వంశీ ఆట తీరు గొప్పగానే ఉన్నప్పటికీ.. అతని బ్యాటింగ్ స్టైల్ మీద కొంతమంది విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడే విధానాన్ని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. దీనివల్ల కొన్ని సందర్భాలలో సమస్యలు ఎదురవుతాయని.. అవి కెరియర్ మొత్తాన్ని ప్రశ్నార్థకం చేస్తాయని వారు గుర్తు చేస్తున్నారు. షార్ట్ పిచ్ బంతులను ఆడలేకపోవడం.. నిలకడ లేకపోవడం.. టెక్నిక్ ప్రదర్శించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని క్రికెట్ విశ్లేషకులు సూర్యవంశకి సూచిస్తున్నారు. ఒకటి రెండు ఇన్నింగ్స్ లలో బీభత్సంగా బ్యాటింగ్ చేయడం ద్వారా అంచనాలు పెరిగిపోతాయని.. ఆ తర్వాత ప్రతి మ్యాచ్లో కూడా గొప్పగా ఆడాల్సిన అవసరం ఏర్పడుతుందని.. అన్ని రోజులు ఒకే విధంగా ఉండవని.. ఒకసారి డౌన్ ఫాల్ మొదలైతే అది కంటిన్యూ అవుతుందని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. వైభవ్ సూర్య వంశీ విఫలం అవుతూ ఉండటం వల్ల.. అది జట్టు మీద తీవ్రమైన ప్రభావం చూపిస్తుందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. ఒకప్పుడు పృథ్వీ షా కూడా ఇలానే ఆడేవాడని.. ఆ తర్వాత అతని లోపాలను ప్రత్యర్థి బౌలర్లు గుర్తించారని.. పదేపదే అదే స్టైల్ లో బంతులు వేయడంతో అతడు వికెట్ సమర్పించుకున్నాడని గుర్తు చేస్తున్నారు క్రికెట్ విశ్లేషకులు. నిలకడ లోపం వల్ల పృథ్వీ ఇప్పుడు ఏకంగా జాతీయ జట్టులో స్థానాన్ని ప్రశ్నార్థకం చేసుకున్నాడు. చివరికి ఐపీఎల్ లో కూడా తుది జట్టులో చోటు సంపాదించుకోలేకపోతున్నాడు. పృధ్వీ ఉదంతాన్ని వైభవ్ సూర్య వంశీ గుర్తుకు తెచ్చుకోవాలని క్రికెట్ విశ్లేషకులు ఈ సందర్భంగా అతడికి విన్నవిస్తున్నారు.

## ఫామ్‌లోకి సంజు..




### స్టార్టింగ్ ప్రాబ్లమ్ పోయినట్టేనా?

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఢిల్లీ క్యాపిటల్స్‌తో పోరుకు ఎంఎస్ ధోని వచ్చేస్తాడని అభిమానులు భావించారు. మరోసారి వారికి నిరాశే ఎదురైంది. ఓ వైపు మూడు వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న సీఎస్‌కేను ఆదుకొనేది ఎవరా? చూస్తుండగా.. డేంజరస్ బ్యాటర్ బ్రెవిస్ తుది జట్టులోకి వచ్చాడు. హమ్మయ్యా.. టాప్ ఆర్డర్ మరింత బలోపేతం అవుతుందని అనుకున్నారు. కానీ, అతడికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. గత మూడు మ్యాచుల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన సంజుపై ఈసారి సీఎస్‌కే అభిమానులు పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. కానీ, తన సత్తా ఏంటో చూపించాలని భావించిన సంజు సెంచరీతో మురిపించాడు. ధోని 'పెద్దన్న' పాత్రకు తాను సిద్ధమని చెప్పకనే చెప్పాడు.

### స్టార్టింగ్ ట్రబుల్ వీడినట్లేనా?

సంజు శాంసన్‌కు స్టార్టింగ్ ప్రాబ్లమ్ ఉన్నట్లుగా ఉంది. భారీ అంచనాలతో సీఎస్‌కేలోకి ఎంట్రీ ఇచ్చాడు. ఎప్పట్నుంచో సంజుకు చెన్నై జట్టు తరఫున ఆడాలని ఉండేదని ఇటీవల రుతురాజ్ కూడా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గత మినీ వేలానికి ముందు అవకాశం వచ్చింది. సీఎస్‌కే ఏకంగా రూ. 18 కోట్లకు మార్చుకుంది. అదేంటో కానీ, తొలి మూడు మ్యాచుల్లో 'ఒత్తిడి'కి గురయ్యాడో.. కొత్తగా అనిపించిందో కానీ పేలవమైన ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొన్నాడు. ఇలాంటి సమయంలోనూ మేనేజ్‌మెంట్ ఒక్క మాట కూడా సంజును అనలేదు. అతడికి మద్దతుగానే నిలిచింది. ఆ నమ్మకాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే వచ్చిన నాలుగో అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు సంజు శాంసన్. దీంతో ఆరంభ సమస్య నుంచి బయటపడినట్లేనని క్రికెట్ విశ్లేషకులూ అంచనా వేస్తున్నారు.



## గిల్, బట్లర్ హాఫ్ సెంచరీలు..


## గుజరాత్ విజయం

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్‌లో భాగంగా లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 165 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (56; 40 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), బట్లర్ (60; 37 బంతుల్లో 11 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. వాషింగ్టన్ సుందర్ (21*), సాయి సుదర్శన్ (15), రాహుల్ తెవాతియా (10*) పరుగులు చేశారు. లఖ్‌నవూ బౌలర్లలో షమీ, ప్రిన్స్ యాదవ్, దిగ్వేశ్ రాఠి తలో వికెట్ తీశారు. నాలుగు మ్యాచ్‌ల్లో గుజరాత్‌కిది రెండో విజయం కాగా.. అన్నే మ్యాచ్‌లు ఆడిన లఖ్‌నవూ రెండో ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ బ్యాటర్లలో ఒక్కరూ కూడా అర్ధ శతకం చేయలేదు. ఓపెనర్ మార్‌క్రమ్ (30) టాప్ స్కోరర్. నికోలస్ పూరన్ (19), రిషభ్ పంత్ (18), అబ్దుల్ సమద్ (18), ముకుల్ చౌదరి (18), జార్జ్ లిండే (16), మహ్మద్ షమి (12*), మిచెల్ మార్ష్ (11) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ (4/28) ఆకట్టుకున్నాడు. అశోక్ శర్మ 2, కగిసో రబాడ, సిరాజ్ ఒక్కో వికెట్ తీశారు.

## కావ్య పాపను ఏడిపించకండి..

### సన్ రైజర్స్ బౌలర్లూ.. జర ఇవి పాటించండి



**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

ఆది చిదంబరం స్టేడియం. చెన్నై, ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై జట్టు 212 పరుగులు చేసింది. కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయింది. బలమైన బౌలింగ్ లైన్ అప్ ఉన్న ఢిల్లీ జట్టుకు చుక్కలు చూపించింది. ముఖ్యంగా చెన్నై ఓపెనర్ సంజు సింహతాండవం చేశాడు. ఈ ఐపీఎల్ లో తొలి సెంచరీని నమోదు చేశాడు. ఓపెనర్ గా వచ్చిన అతడు.. కడదాకా నిలబడ్డాడు. 115* పరుగులు చేసి సంచలనం సృష్టించాడు.

పిచ్ నుంచి బౌలర్లకు పెద్దగా సహకారం లేదు. దీంతో ఢిల్లీ జట్టు 212 పరుగులను ఈజీగా ఫినిష్ చేస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఇక్కడే మ్యాజిక్ జరిగింది. చెన్నై బౌలర్లు రెచ్చిపోయారు. ముఖ్యంగా ఓవర్టన్ మ్యాజిక్ చేశాడు. కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి.. నాలుగు వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుత ఐపీఎల్ లో ఏ బౌలర్ కైనా సరే ఇదే అత్యుత్తమ ప్రదర్శన.. దానిని ఓవర్టన్ చేసి చూపించాడు.

ఇక చెన్నై విజయాన్ని కాస్త పక్కన పెడితే.. మన హైదరాబాద్ జట్టు విషయానికొద్దాం. అభిషేక్ శర్మ పంజాబ్ జట్టుతో జరిగిన మ్యాచ్ లో 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఐపీఎల్ లో ఇది మామూలు టార్గెట్ కాదు. ఈ టార్గెట్ కాపాడుకోవడంలో హైదరాబాద్ జట్టు దారుణంగా విఫలమైంది. పంజాబ్ జట్టు బ్యాటర్లు పిచ్చ కొట్టుడు కొడుతుంటే.. హైదరాబాద్ బౌలర్లు చూస్తూ ఉండిపోయారు.. 220 టార్గెట్ కూడా కాపాడుకోలేక ప్రేక్షకులుగా మిగిలిపోయారు. ముల్లాన్ పూర్ పిచ్ ఫ్లాట్ గా ఉంది. దాని అంచనా వేసి పంజాబ్ జట్టు సారథి అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అప్పుడు హైదరాబాద్ బ్యాటర్లు ఏం చేయాలి.. భారీగా పరుగులు చేయాలి. వికెట్లు వెంటనే పడేసుకోకూడదు. ఓపెనింగ్ భాగస్వామ్యం బాగానే వచ్చింది. కానీ మిడిల్ ఆర్డర్ విఫలమైంది. ఎవరిని పంపించాలో తెలియక.. ఎవరో ఒకరిని పంపించారు. వారేమో సరిగా ఆడలేక పంజాబ్ బౌలర్లకు దాసోహం అయ్యారు. ప్రారంభ ఓవర్లలో వచ్చిన స్కోర్ కు.. చివర్లో వచ్చిన స్కోర్ కు ఏమాత్రం సంబంధం లేదు. వాస్తవానికి పంజాబ్ జట్టు ఎదుట హైదరాబాద్ ఏకంగా 270 రన్స్ టార్గెట్ పెడుతుందని అందరూ అనుకున్నారు. కానీ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ల వైఫల్యం వల్ల అది కాస్త 220 పరుగులకే పరిమితమైంది.

ఈ లక్ష్యాన్ని కాపాడుకోవడం పెద్ద కష్టం కాదు. పిచ్ నుంచి సహకారం లేదనుకుందాం. అలాంటప్పుడు శశాంక్ అనే పంజాబ్ బౌలర్ అంత కట్టుదిట్టంగా బంతులు ఎలా వేశాడు.. వికెట్లు ఎలా పడగొట్టాడు.. అనే విషయాన్ని హైదరాబాద్ బౌలర్లు పూర్తిగా మర్చిపోయారు. సీమ్ ఆఫ్ డెలివరీ లు వేయడం. ఫ్లాట్ పిచ్ మీద పేస్ ను జనరేట్ చేయడం వల్ల పరుగులు సమర్పించుకున్నారు. కొందరు బౌలర్లు అయితే ఫుల్ టాస్ బంతులను బ్యాట్ ఎత్తుకు వేశారు. దీంతో పంజాబ్ బ్యాటర్లు పండగ చేసుకున్నారు.. బ్యాకప్ లెంత్ బంతులు వేయడాన్ని హైదరాబాద్ బౌలర్లు అలవాటుగా మార్చుకున్నారు. తగిన మూల్యాన్ని చెల్లించుకున్నారు.

హైదరాబాద్ బౌలింగ్ ఎంత దారుణంగా ఉందో.. మ్యాచ్ ఓడిపోయిన తర్వాత కెప్టెన్ కిషన్ చెప్పిన మాటలు వెల్లడిస్తున్నాయి. కిషన్ తీరు అలా ఉంటే.. సామాన్య ప్రేక్షకుడి స్పందన ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే హైదరాబాద్ బౌలర్లు పూర్తిగా మారిపోవాలి. కావ్య పాపను ఏడిపించకుండా.. గెలిపించాలి. ఇవన్నీ జరగాలంటే బౌలింగ్లో సమూల ప్రక్షాళన జరగాలి. ఇప్పుడే సన్ "రైజర్స్" అయ్యేది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.04.2026 సోమవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






# మృణాల్ తెలుగింటి కోడలు కాబోతున్నదా?

**హాట్ టాపిక్ గా అల్లు అరవింద్ వ్యాఖ్యలు**

ముద్ర, సినిమా డెస్క్: స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తెలుగింటి కోడలు కాబోతుందా అనే చర్చ సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చేసిన సరదా వ్యాఖ్యలు ఈ అంశాన్ని హాట్ టాపిక్‌గా మార్చాయి. మృణాల్ ఠాకూర్ ప్రతిభపై స్పందించిన అల్లు అరవింద్, తక్కువ సమయంలోనే ఆమె మంచి గుర్తింపు సంపాదించుకుందని తెలిపారు. 'సీతారామం' చిత్రంతో తన నటన ప్రతిభను నిరూపించుకుని తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గతాన్ని గుర్తుచేస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో ఒక హీరోయిన్‌ను మనస్ఫూర్తిగా దీవించానని, అనంతరం ఆమె వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకుని తమ ఇంటి కోడలిగా మారిందని తెలిపారు. అదే విధంగా మృణాల్ ఠాకూర్‌ను కూడా దీవిస్తున్నానని, తెలుగు సినిమాలు చేస్తూ ఇక్కడే ఒక మంచి వ్యక్తిని చూసుకుని పెళ్లి చేసుకుని తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడాలని కోరుకుంటున్నట్లు సరదాగా వ్యాఖ్యానించారు. అల్లు అరవింద్ చేసిన ఈ వ్యాఖ్యలతో మృణాల్ ఠాకూర్ తెలుగింటి కోడలు కాబోతుందా అనే చర్చ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ వర్గాల్లో కూడా ఈ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చలకు దారితీస్తున్నాయి.





# వాటికే పరిమితం కాను

ముద్ర, సినిమా డెస్క్:

టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ప్రియాంక అరుళ్ మోహన్, విభిన్న పాత్రలే తన లక్ష్యమని తెలిపారు. 'గ్యాంగ్ లీడర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇటీవల 'మేడ్ ఇన్ కోరియా' చిత్రంతో మరోసారి మంచి స్పందన పొందారు. బయో టెక్నాలజీలో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సినిమాలపై ఆసక్తితో నటిగా మారానని ప్రియాంక తెలిపారు. 'ఒంధ్ కథే హెళ్లా' అనే కన్నడ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నాని, శర్వానంద్ వంటి హీరోలతో కలిసి పనిచేయడం ద్వారా ఎంతో నేర్చుకున్నానని, పవన్ కళ్యాణ్‌తో 'ఓజీ' (OG) చిత్రంలో నటించడం మరచిపోలేని అనుభవంగా నిలిచిందన్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, సవాలు చేసే విభిన్న పాత్రల్లో నటించడానికే తాను ఆసక్తి చూపుతానని ప్రియాంక అరుళ్ మోహన్ స్పష్టం చేశారు.



# ఎర్ర చీరలో యశిక ఆనంద్ గ్లామర్ షో

**ముద్ర, సినిమా డెస్క్:** నటి యశిక ఆనంద్ ఎర్ర చీరలో చేసిన తాజా ఫోటోషూట్‌తో మరోసారి ఆకట్టుకుంది. ఎర్ర రంగు డ్రేప్డ్ సారీతో పాటు మెరిసే డిజైనర్ బ్లౌజ్‌లో స్టైలిష్ లుక్‌లో కనిపించిన ఆమె, రెండు చేతులను తల వెనుకకు ఉంచి ధైర్యంగా ఇచ్చిన పోజ్ అభిమానులను ఆకర్షిస్తోంది. "ఇట్స్ మై వే ఆర్ మై అదర్ వే" అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్ కూడా ప్రత్యేకంగా నిలిచింది. ఈ లుక్‌కు సరిపోయే మేకప్, హెయిర్ స్టైల్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. స్టైలిష్ డిజైనర్ దుస్తులతో చేసిన ఈ ఫోటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# అభిమానులకు కావ్య థాపర్ అందాల విందు

ముద్ర, సినిమా డెస్క్:

నటి కావ్య థాపర్ మరోసారి తన గ్లామర్ ఫోటోలతో అభిమానులకు అందాల విందు అందించింది. స్టైలిష్ దుస్తుల్లో ఆకర్షణీయమైన పోజులతో ఆమె పంచుకున్న తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎలిగెంట్ అవుట్‌ఫిట్స్‌లో మెరిసిన కావ్య థాపర్, తన స్టైలిష్ లుక్స్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సింపుల్ మేకప్, స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయ్యింది. ప్రతి ఫోటోలో కనిపిస్తున్న ఆమె కాన్ఫిడెంట్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తాజా ఫోటోషూట్‌లో కావ్య థాపర్ చూపించిన గ్లామర్ షో ప్రస్తుతం నెటిజన్లను అలరిస్తూ, సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీస్తోంది.



# బేబమ్మకు వరుస ఫ్లాపులు

**'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'తో మరోసారి నిరాశ**

ముద్ర, సినిమా డెస్క్:

'ఉప్పెన' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన నటి కృతి శెట్టి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు సాధించింది. ఆ తరువాత 'శ్యామ్ సింగ రాయ్', 'బంగార్రాజు' చిత్రాలతో వరుస విజయాలు అందుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. అయితే అనంతరం ఆమె నటించిన పలు చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో కెరీర్‌లో వరుస నిరాశలు ఎదురవుతున్నాయి. తాజాగా విడుదలైన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం కూడా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తమిళంలో వీకెండ్ రోజుల్లో కొంత వసూళ్లు వచ్చినప్పటికీ, తెలుగులో స్పందన పరిమితంగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2040 నేపథ్యంలో తెరకెక్కిన ఈ ప్రేమకథలో కథ, కథనం ఆశించిన స్థాయిలో లేకపోవడం నెగటివ్ స్పందనకు కారణమవుతోందని భావిస్తున్నారు. ఈ చిత్రంలో కృతి శెట్టికి నటనకు కొంత అవకాశమున్నప్పటికీ, తన ప్రతిభను పూర్తిస్థాయిలో చూపించే స్థలం దక్కలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే ఏడాది విడుదలైన కార్తీతో చేసిన చిత్రం కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం కృతి శెట్టి నటించిన 'జీనీ' చిత్రం విడుదల కోసం ఎదురుచూస్తోంది. జయం రవి హీరోగా రూపొందిన ఈ ఫాంటసీ డ్రామా వివిధ కారణాలతో ఆలస్యం అవుతోంది. ఇప్పటికే పలువురు ప్రముఖ హీరోలతో నటించినప్పటికీ, మరో భారీ విజయంతో మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా అన్నది సినీ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# యోధుడి లుక్‌లో అరవింద్ కృష్ణ..

**'కర్మస్థలం'పై పెరుగుతున్న అంచనాలు**

ముద్ర, సినిమా డెస్క్:

రాయ్ ఫిల్మ్స్ సమర్పణలో అరవింద్ కృష్ణ, చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి ప్రధాన పాత్రల్లో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. ఈ చిత్రాన్ని రాయ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా, సంగీతాన్ని సాయి కార్తిక్ అందిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు ప్రేక్షకులను ఆకర్షించగా, తాజాగా అరవింద్ కృష్ణ పాత్రకు సంబంధించిన కొత్త లుక్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం సూపర్ హీరో తరహా పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న అరవింద్ కృష్ణ, ఈ చిత్రంలో యోధుడి రూపంలో కనిపించబోతున్నారు. విడుదలైన లుక్‌లో ఆయన పాత్ర శక్తివంతంగా కనిపిస్తుండగా, విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చిత్రబృందం భావిస్తోంది. ఈ చిత్రంలో అరవింద్ కృష్ణతో పాటు చుంకీ పాండే, అర్చనా శాస్త్రి, ప్రిన్స్, దివి, కాలకేయ ప్రభాకర్, వెంకటేష్ ముమ్మిడి, వినోద్, బలగం సంజయ్, దిల్ రమేష్, నాగ మహేష్, వినోద్ అల్వా, మిథాలీ చౌహన్, కిల్లి క్రాంతి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.





# ఎల్లమ్మకు ముహూర్తం కుదిరినట్లేనా?..

**మూడో వారంలో షూటింగ్**

ముద్ర, సినిమా డెస్క్:

సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా తెరకెక్కనున్న 'ఎల్లమ్మ' చిత్రానికి ఎట్టకేలకు ముహూర్తం కుదిరినట్లు సమాచారం. ఈ నెల మూడో వారం నుంచి షూటింగ్ ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 'బలగం' చిత్రంతో గుర్తింపు పొందిన వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాలతో కూడిన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సినిమాతో దేవి శ్రీ ప్రసాద్ తొలిసారి పూర్తి స్థాయిలో హీరోగా కనిపించనుండటం ఆసక్తిగా మారింది. తొలి షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.




# 'తిమ్మరాజుపల్లి టీవీ' నుంచి 'గోపాల గోపాల' పాట విడుదల

ముద్ర, సినిమా డెస్క్:

హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్, సుమైర స్టూడియోస్ బ్యానర్లపై నిర్మిస్తున్న 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం నుంచి 'గోపాల గోపాల' పాటను విడుదల చేశారు. న్యూ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ రూపొందుతున్న ఈ చిత్రంలో సాయి తేజ్, వేద జలంధర్ హీరో, హీరోయిన్‌లుగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాతో వి. మునిరాజు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విలేజ్ నేపథ్యంతో పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ నెల 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా విడుదలైన 'గోపాల గోపాల' పాటకు సనరే సాహిత్యం అందించగా, వంశీకాంత్ రేఖన స్వరాలు సమకూర్చారు. మేఘన నాయుడు ఆలపించిన ఈ పాట కలియుగంలో జరుగుతున్న పరిణామాలను గోవిందుడికి విన్నవించే భావంతో సాగుతూ ఆకట్టుకునేలా రూపొందించారు.




# మూగబోయిన కోకిల స్వరం

**ప్రముఖ గాయని ఆశాభోంస్లే కన్నుమూత**
**ముంబయిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**
**ఛాతి ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రిలో చేరి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్**
**సోమవారం శివాజీ పార్క్‌లో అంత్యక్రియలు**
**సినీ లోకంలో విషాదం.. ప్రముఖుల సంతాపం**
**సంగీత ప్రపంచంలో ముగిసిన స్వరశకం**

ముద్ర డెస్క్ :

ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) ఇకలేరు. ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె కుమారుడు ఆనంద్ బోంస్లే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. తన తల్లి అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబయిలోని శివాజీ పార్క్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ సోకడంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడగా ఆశా భోంస్లేను కుటుంబ సభ్యులు శనివారం రాత్రి ఆస్పత్రిలో చేర్చారు. మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కారణంగా మరణించినట్లు ఆమెకు చికిత్స అందించిన వైద్యుల్లో ఒకరైన డాక్టర్ ప్రతీప్ సందానీ మీడియాకు తెలిపారు. ఆశా భోంస్లే మృతి పట్ల సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియాలో సంతాపం ప్రకటిస్తున్నారు. 1933లో మహారాష్ట్రలోని సాంగ్లీలో ఆశా భోంస్లే జన్మించారు. గాయనిగా సుదీర్ఘ ప్రయాణం ఆమెది. ఎన్నో వేల పాటలతో శ్రోతలను అలరించారు. చిత్ర పరిశ్రమకు చేసిన ఎనలేని కృషికిగానూ పద్మ విభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, మహారాష్ట్ర భూషణ్, బంగా బిభూషన్ అవార్డులు ఆమెను వరించాయి. ఆశా సినీ ప్రస్థానం 1943లో మరాఠీ చిత్రం 'మజాబ్'తో ప్రారంభమైంది. అందులో 'చలా చలా నవ్ చలా' పాట పాడారు. 1948లో బాలీవుడ్ దర్శకుడు హంసరాజ్ బహల్ పిలుపుతో ముంబయి వెళ్లారు. 1954లో వచ్చిన 'బూట్ పాలిష్'లోని పాటలతో ఆశాకు మంచి గుర్తింపు దక్కింది. 'దమ్ మారో దమ్', 'చురా లియా హై తుమ్నే జో దిల్ కో' తదితర పాటలు సంచలనం సృష్టించాయి. తెలుగు సినిమాల్లో ఆశా భోంస్లే పాడింది తక్కువ పాటలే అయినా దేనికదే ప్రత్యేకం. 80ల నుంచి 2007 వరకూ తెలుగులో పాడారు. 'ఇది మౌనగీతం' (పాలు నీళ్లు), 'సీతాకాలం ప్రేమకు' (అశ్వమేధం), 'ఐసాలకిడీ' (పవిత్ర బంధం), నాలో ఊహలకు (చందమామ) తదితర పాటలతో ఆమె అలరించారు. తన సోదరి, ప్రముఖ గాయని లతా మంగేష్కర్ వ్యక్తిగత కార్యదర్శి గణపతిరావును పెళ్లి చేసుకున్నారు. కొన్నాళ్లకు విడాకులు తీసుకున్నారు. 1980లో ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్డీ బర్మన్‌ను వివాహమాడారు. 1994లో ఆయన మరణించడంతో.. అప్పటి నుంచి తన ముగ్గురు పిల్లలు, మనవడు, మనవరాలే లోకంగా జీవితం గడిపారు.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com